teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 243 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 4 జనవరి 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## నేడు సమావేశంకానున్న రాష్ట్ర క్యాబినెట్

రైతు భరోసా, రేషన్ కార్డుల జారీపై చర్చించనున్నట్లు సమాచారం



02

## కేంద్రానికి సుప్రీం కోర్ట్
# సీరియస్ వార్నింగ్

### వైద్య విద్య సీట్లపై కోర్ట్ కీలక ఆదేశాలు జారీ

### కాలేజీల్లో సీట్లు ఖాళీగా ఉండటానికి వీల్లేదని వార్నింగ్

వైద్య విద్యకు సంబంధించిన సీట్లపై దేశ సర్వోన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. మెడికల్ కాలేజీల్లో సీట్లు ఖాళీగా ఉండటానికి వీల్లేదని కేంద్రానికి సీరియస్ వార్నింగ్ ఇచ్చింది.



న్యూ ఢిల్లీ, జనవరి 03 (తీన్మార్ న్యూస్): సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో వెయ్యికి పైగా సీట్లు ఖాళీగా ఉండటంపై సుప్రీంకోర్ట్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఓ వైపు వైద్యుల కొరత ఉండటం, మరోవైపు ఇలా వైద్య సీట్లు భర్తీ కాకపోవడంపై అసహనం తెలిపింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వాలతో సహ ఇతర భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. కాగా దీనిపై కేంద్రం ఓ కమిటిని ఏర్పాటు చేయగా ఈ అంశంపై కమిటీకి మూడు నెలల సమయం ఇస్తూ అప్పటిలోగా వైద్య సీట్లు మిగిలిపోకుండా తీసుకోవాల్సిన విధానాలను సూచించాలని పేర్కొంది. తదుపరి విచారణను ఏప్రిల్ లో చేపడతామని ఈ సందర్భంగా సుప్రీంకోర్ట్ తెలియ జేసింది.





## ఫార్ములా ఈ- రేస్ కేసులో మరో కీలక పరిణామం

కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు నోటీసులు జారీ

ఈనెల 6న విచారణకు హాజరుకావాలని సూచన

హైదరాబాద్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): ఫార్ములా ఈ- రేస్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు విచారణకు హాజరుకావాలని శుక్రవారం జారీ చేసిన నోటీసుల్లో పేర్కొనబడింది. కేటీఆర్‌తో పాటు, బీఎల్ఎన్ రెడ్డి, అర్వింద్ కుమార్‌లకు కూడా నోటీసులు

మిగతా 2 లో




## గ్రామీణ భారత్ మహెూత్సవ్ 2025 ప్రారంభించనున్న ప్రధాని

గ్రామీణ భారతదేశ సాధికారత చేయడంపై దృష్టి

న్యూ ఢిల్లీ, జనవరి 03 (తీన్మార్ న్యూస్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేడు న్యూఢిల్లీలో గ్రామీణ భారత్ మహెూత్సవ్ 2025ను ప్రారంభించనున్నారు. మహెూత్సవ్ గ్రామీణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, స్వావలంబన ఆర్థిక వ్యవస్థలను సృష్టించడం మరియు

మిగతా 2 లో



## రోజు రోజుకు పెరుగుతున్న చలి తీవ్రత

ఆదిలాబాద్ లో కనిష్ఠ ఉష్ణోగ్రత 7.2 డిగ్రీలుగా నమోదు

ఈ మేరకు వాతావరణ శాఖ వెల్లడి

తెలంగాణ బ్యూరో, జనవరి 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతోందని వాతావరణ శాఖ వెల్లడించింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదు అవుతున్నట్లు తెలిపింది. రాష్ట్రంలో ఈశాన్య గాలులు చురుకుగా వీస్తుండటంతో చలి తీవ్రత మరింత పెరిగిందని

మిగతా 2 లో

## రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు



గతంలో బీఆర్ఎస్.. ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటున్నాయ్

వ్యక్తిగత కక్షలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపణలు

02



## పోలీస్ విభాగంలో ఉత్తమ బాక్సింగ్, క్రికెట్ కేంద్రాలు

కేంద్రాల ఏర్పాటుకు యోచిస్తున్నట్లు డీజీపీ వెల్లడి

హైదరాబాద్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రత్యేక పోలీస్ విభాగంలో ఉత్తమ స్థాయిలో బాక్సింగ్, క్రికెట్ కేంద్రాలను నెలకొల్పాలని యోచిస్తున్నట్లు డీజీపీ జితేందర్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా టీజీఎస్పీ బెటాలియన్లలో శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుల్‌ల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమాలు శుక్రవారం జరిగాయి. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ మొదటి బెటాలియన్‌లో డీజీపీ జితేందర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో బాక్సింగ్, క్రికెట్ క్రీడలలో తెలంగాణ రాష్ట్ర

మిగతా 2 లో

## నేషనల్ హైవే ప్రాజెక్టులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా

రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ ప్రక్రియకు ఆదేశాలు



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆర్‌ఆర్‌ఆర్, అర్‌అండ్‌బీ, నేషనల్ హైవే ప్రాజెక్టులపై శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. రీజినల్ రింగ్ రోడ్డుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

హైదరాబాద్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): నాగ్‌పూర్ - విజయవాడ కారిడార్ కు సంబంధించి తెలంగాణ జిల్లాల్లో అసంపూర్తిగా మిగిలిన భూసేకరణ ప్రక్రియను సంక్రాంతిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అటవీ శాఖ పరిధిలో ఉన్న సమస్యలను

మిగతా 2 లో




## సెట్ పరీక్ష నిర్వహణపై స్పష్టతను ప్రకటించాలని విజ్ఞప్తి

అర్హులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి

తెలంగాణ బ్యూరో, జనవరి 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల నియామకాలపై ప్రత్యేక దృష్టి పెట్టి 2024 లో జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన విషయం తెలిసిందే. కాగా ఈ క్యాలెండర్ ప్రకారం 2025 జూన్‌లో డిగ్రీ కళాశాల అధ్యాపకుల నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నియామక ప్రక్రియలో

మిగతా 2 లో



## నాగోబా జాతరకు ముహూర్తం ఖరార్

ఈ నెల 28న మహాపూజతో జాతర ప్రారంభం

5 రోజుల పాటు జాతర ఘనంగా జరుగనున్న జాతర

ఆదిలాబాద్, జనవరి 03 (తీన్మార్ న్యూస్: దేశంలోనే రెండో అతిపెద్ద ఆదివాసీ గిరిజన నాగోబా జాతరకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 28న మహాపూజతో జాతర ప్రారంభం కానున్నట్టు మెస్రం వంశీయులు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం

మిగతా 2 లో

## తెలంగాణలో బ్లాక్ చైన్ సిటీ ఏర్పాటు

రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ప్రకటన

తెలంగాణలో బ్లాక్ చైన్ సిటీని ఏర్పాటు చేయబోతున్నట్లు రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ప్రకటన చేశారు. ఎక్కడ ఏర్పాటు చేయాలి. ఎంత విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలనే అంశంపై ఇప్పటికే సంబంధిత పరిశ్రమలు, నిపుణులతో సంప్రదింపులు ప్రారంభించామన్నారు.



తెలంగాణ బ్యూరో, జనవరి 03 (తీన్మార్ న్యూస్): శుక్రవారం మాదాపూర్‌లో డ్రోన్ టెక్నాలజీ, రోబోటిక్స్ రంగంలో సుమారు 1800 మందికి ఉపాధి కల్పిస్తున్న సెంటిలియన్ నెట్ వర్క్స్ అండ్ హెచ్‌సీ రోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ నూతన క్యాంపస్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త


మిగతా 2 లో



## 25 ఏండ్ల భవిష్యత్తు అవసరాలను మంచినీటి సరఫరాకు ప్రణాళిక

హైదరాబాద్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): పెరుగుతున్న జనాభా నేపథ్యంలో రాబోయే 25 ఏండ్ల భవిష్యత్తు అవసరాలను అంచనా వేసుకుని, గ్రేటర్ హైదరాబాద్ సిటీలో మంచినీటి సరఫరాకు సరిపడే మౌలిక సదుపాయాల ప్రణాళికను తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జలమండలి అధికారులను ఆదేశించారు. సిటీ ప్రజలకు సమర్ధవంతంగా మంచినీటి సరఫరా

మిగతా 2 లో



# అంధుల పాలిట వరం బ్రెయిలీ లిపి

## నేడే ప్రపంచ అంధుల దినోత్సవం

అంధులైన విద్యార్థుల జీవితాల్లో అక్షర వెలుగులు నింపిన ఆశాజ్యోతి లూయి బ్రెయిలీ. లూయి బ్రెయిలీ జనవరి 4,1809 సంవత్సరంలో జన్మించారు. అతని జన్మదినాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ అంధుల దినోత్సవంగా జరుపుకుంటారు. లూయీ బ్రెయిలీ ప్యారిస్ కు 20 మైళ్ల దూరంలో ఉన్న క్రూవే అనే గ్రామంలో గుర్రపు జీనులు తయారు చేసే వారి కుటుంబంలో జన్మించారు. లూయీ బ్రెయిలీ తమ మూడు సంవత్సరాల వయసులో ఒకరోజు తాము తమ తల్లిదండ్రులు తమ పనిలో నిమగ్నలై ఉండగా ఒక చిన్న తోలు ముక్క కత్తి తీసుకుని తన తండ్రిని అనుసరిస్తూ ఉండగా కత్తి ఎగిరి కంటిలో గుచ్చుకుంది. కంటి నుంచి రక్తం దారాపాతంగా కారి, ఒక కంటి చూపు కోల్పోయాడు. అతని తల్లిదండ్రులు గాని వైద్యులు గాని ఏమి చేయలేకపోయారు. కొన్ని నెలల తర్వాత అతడు తన రెండవ కంటి చూపును కూడా కోల్పోయాడు. దీనితో మూడు వసంతాలు గడవకముందే ప్రకృతిలో అందాలను చూసే అవకాశం లేకపోయింది. అంధుడైన లూయి అక్కాచెల్లెళ్లతో కలిసి గ్రామంలో ఉన్న మామూలు బడికి వెళ్ళసాగాడు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను వింటూ తన విద్యను కొనసాగిస్తూ ఒక మంచి విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. లూయి సూక్ష్మ గ్రహణ శక్తికి ఉపాధ్యాయులు ఆశ్చర్యపోయారు. తమ కుమారుని కష్టాలను తొలగించడానికి లూయి తండ్రి చాలా కష్టపడి చిన్న చిన్న ముక్కలను చెక్కపై అక్షరాల ఆకారంలో నేర్పేవారు. వాలంటీవ్ హవె ప్రపంచంలో మొట్టమొదటి అంధుల పాఠశాలను పారిస్ కు 17 కి. మీ దూరంలో స్థాపించాడు. ఆయన తన పాఠశాలలోని విద్యార్థులు అక్షరాలను చేతితో తడిమి గుర్తుపట్టేట్లుగా కాగితంపై అక్షరాల ఆకారాన్ని ఉబెత్తుగా వచ్చేటట్లు చేసేవాడు. దీనిని లైన్ టైప్ అని పిలిచేవారు. లూయి1929 సం" లో వాప్రే స్థాపించిన పాఠశాలలో చేరి లైన్ టైప్ పద్ధతినే నేర్చుకొని తెలివిగల విద్యార్థిగా పేరుగాంచారు. అతని కార్యదీక్షతకు మేద సంపత్తికి నిదర్శనం. అతడు 17సం "ల వయసులోనే తను చదివిన పాఠశాలలో ఉపాధ్యాయుడిగా నియమితుడు కావడం గొప్ప విశేషం. 1821సం "లో సైనిక అధికారిగా పదవి విరమణ చేసిన మార్చియర్ కలిసి సైమన్ భార్చియర్ తన సైనికులకు రాత్రులలో కూడా సమాచారాలను తెలుసుకొనడానికి 12 గుండ్రని ఉబెత్తు చుక్కలను కాగితంపై వ్రాసేవాడు. ఈ 12 చుక్కలన్నింటిని లూయి 6 చుక్కలకు కుదించి కొత్త లిపిని కనుగొన్నాడు. లూయి తన లిపికి అధికార గుర్తింపు తెచ్చుటకై ఎంతో శ్రమించాడు. అతని ఆనారోగ్యంతో 1852 జనవరి 6న మరణించారు. లూయి తాను మ-రణించిన తర్వాత 100 సంవత్సరాలకు అధికార గుర్తింపు వచ్చింది.లూయి బ్రేలి 216 జయంతి నేడు. ప్రపంచంలోనే అంధులందరూ ఈ ఆరు చుక్కల లిపిని అభ్యసించారు. అన్నీ అవయవాలు ఉండి కూడా ఆకతాయిలుగా తిరుగుతున్న యువతను ఈ రోజుల్లో చాలామందిని చూస్తున్నాం అంధులైన విద్యార్థులు ఎందులోనూ తక్కువ కాకుండా ఆత్మస్థైర్యంతో అన్ని అవరోధాలను అధిగమించి బ్రెయిలీలిపితో అక్షరాభ్యాసాన్ని నేర్చుకుంటున్నారు. ఉన్నత విద్యను అభ్యసించి ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగ సంస్థల్లో కొలువుల్లో ముందుకు సాగుతున్నారు.



గోళ్ళ నరేందర్ 9542196336

## గ్రామీణ భారత్ మహోత్సవ్ 2025 ప్రారంభించనున్న ప్రధాని

మొదటి పేజీ తరువాయి



గ్రామీణ వర్గాలలో ఆవిష్కరణలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఆరు రోజుల మహోత్సవ్ యొక్క ఇతివృత్తం విక్షిత్ భారత్ 2047 కోసం స్థిరమైన గ్రామీణ భారతదేశాన్ని నిర్మించడం. ఈ ఈవెంట్ యొక్క లక్ష్యం గ్రామీణ జనాభాలో ఆర్థిక స్థిరత్వం మరియు ఆర్థిక భద్రతను ప్రోత్సహించడం, ఈశాన్య భారతదేశంపై ప్రత్యేక దృష్టి సారించడం. మహోత్సవ్ యొక్క ముఖ్యమైన దృష్టి గ్రామీణ మహిళలకు వ్యవస్థాపకత ద్వారా సాధికారత కల్పించడం. ఇది ప్రభుత్వ అధికారులు, గ్రామీణ పారిశ్రామికవేత్తలు, కళాకారులు మరియు విభిన్న రంగాలకు చెందిన వాటాదారులను కలిసి సహకార మరియు సామూహిక గ్రామీణ పరివర్తన కోసం రోడ్‌మ్యాప్‌ను రూపొందించడానికి వీలు కల్పిస్తుంది. మహోత్సవ్ శక్తివంతమైన ప్రదర్శనలు మరియు ప్రదర్శనల ద్వారా భారతదేశం యొక్క గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శిస్తుంది.

## రోజు రోజుకు పెరుగుతున్న చలి తీవ్రత

మొదటి పేజీ తరువాయి

పేర్కొంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. ఆదిలాబాద్ జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 12.8 డిగ్రీల నుంచి 7.2 డిగ్రీలకు పడిపోయిందని తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలకు రెండు రోజుల పాటు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా రెండు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. అత్యంత కనిష్ఠంగా హెచ్‌సీయూలో 8.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బీహెచ్‌ఈఎల్ వద్ద 8.8, రాజేంద్రనగర్‌లో 9.4, మౌలాలీలో 9.6, శివరాంపల్లిలో 10.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. దీంతో ప్రజలు చలికి వణికిపోయారు. శుక్రవారం రాత్రి కూడా ఇలాగే ఉంటుందని, ఉష్ణోగ్రతలు అతి తక్కువకు పడిపోతాయని వాతావరణ శాఖ తెలిపింది.

## ఫార్ములా ఈ- రేస్ కేసులో మరో కీలక పరిణామం

మొదటి పేజీ తరువాయి

జారీ అయ్యాయి. కేటీఆర్ విచారణ పూర్తయిన తర్వాత వారిని కూడా విచారించే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు, ఈ కేసులో ఇప్పటికే నోటీసులు అందుకున్న హెచ్ఎండీఏ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఈడీ విచారణకు గైర్హాజరయ్యారు. గడువు కావడంతో వారు ఈమెయిల్ ద్వారా అభ్యర్థన పంపారు. ఈ నేపథ్యంలో వీరి విచారణను తాత్కాలికంగా వాయిదా వేసి, కొత్త తేదీలతో ఈడీ అధికారులు మళ్లీ నోటీసులు జారీ చేశారు. ఫార్ములా-ఈ రేసు నిర్వహణకు మంత్రి మండలి ఆమోదం లేకుండా, ఆర్బీఐ అనుమతి తీసుకోకుండానే నిధులు మళ్లించారనే ఆరోపణలతో, మాజీ మంత్రి కేటీఆర్, హెచ్ఎండీఏ పూర్వ కమిషనర్ అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి పై అవినీతి నిరోధకశాఖ కేసు నమోదు చేసింది. ఇదిలా ఉంటే ఇప్పటికే ఈ కేసులో ఈనెల 7న హాజరుకావాలని కేటీఆర్ కు ఈడీ నోటీసులు జారీ చేసింది. అయితే ఈ నేపథ్యంలో ఏసీబీ సైతం నోటీసులు జారీ చేయడంతో ఫార్ములా ఈ రేసు కేసులో సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

## సెట్ పరీక్ష నిర్వహణపై స్పష్టతను ప్రకటించాలని విజ్ఞప్తి

మొదటి పేజీ తరువాయి

పాల్గొనడానికి అభ్యర్థులు అర్హత పొందవలసిన పరీక్ష, తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీజి సెట్) 2025 జనవరి నెలలో నోటిఫికేషన్ జారీ చేసి, మేలో పరీక్ష నిర్వహించి, జూన్ నాటికి అర్హత కలిగిన అభ్యర్థులకు సర్టిఫికెట్ అందించాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఇది ఒక అర్హత పరీక్ష కాబట్టి గతంలో టీఎస్ టెట్ నిర్వహించి డీఎస్సీ 2024, మరియు 2025 డీఎస్సీ నిర్వహిస్తున్నారు. కాబట్టి అదేవిధంగా టిజిసెట్ 2025 నిర్వహించి డిఎల్ 2025 నోటిఫికేషన్ ఇవ్వాలని అభ్యర్థులు కోరుకుంటున్నారు. ఈ రకంగా పరీక్ష నిర్వహిస్తే రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1500 మంది కొత్త అభ్యర్థులకు అవకాశాలను అందించిన వారు అవుతారని అభ్యర్థులు కోరుతున్నారు. డిగ్రీ కళాశాలలు విశ్వవిద్యాలయాలు, మరియు ఇంజనీరింగ్ కళాశాలల్లో అధ్యాపకుల నియామకానికి సెట్/నెట్ లేదా పీహెచ్‌డీ అర్హతను తప్పనిసరిగా అమలు చేస్తున్నందున, అభ్యర్థులందరూ ఈ పరీక్షకు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. అభ్యర్థులు, టీఎస్ సెట్ 2025 నోటిఫికేషన్ త్వరగా విడుదల చేసి, పరీక్ష నిర్వహణపై స్పష్టమైన సమయం ప్రకటించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇది వారి భవిష్యత్తు అవకాశాలను మెరుగుపరచడంలో ముఖ్యమైన అడుగు అవుతుందని అభిప్రాయపడ్డారు.

## నేషనల్ హైవే ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షా

మొదటి పేజీ తరువాయి

వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అటవీ, ఆర్‌అండ్‌బీ శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. అటవీశాఖ పరిధిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు ఉండాలని విడతల వారీగా నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక తెలంగాణ ఏ గ్రామానికి రోడ్డు లేదనే మాట వినపడొద్దని సూచించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రోడ్డు వెడల్పు ఉండే విధంగా డిజైన్ చేయాలన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, సీఎస్ శాంతికుమారి, ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు.

## తెలంగాణలో బ్లాక్ చైన్ సిటీ ఏర్పాటు

మొదటి పేజీ తరువాయి

సాంకేతికల ఆవిష్కరణలో తెలంగాణను నంబర్ వన్‌గా నిలిచేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా రంగాల్లో తెలంగాణ యువతకు స్కిల్స్ యూనివర్సిటీ, పరిశ్రమల సహకారంతో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఫ్యూచర్ సిటీ లో నిర్మించతలపెట్టిన ఏఐ యూనివర్సిటీకి త్వరలో శంఖుస్థాపన చేయబోతున్నామని అన్నారు. ప్రత్యేకంగా క్వాంటం కంప్యూటింగ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్‌ను ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. దేశంలో ఫ్రాంటియర్ టెక్నాలజీ హబ్‌ను ఏర్పాటు చేసే యోచనలో కేంద్రం ఉందని ఆ హబ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలంటూ ఇప్పటికే కేంద్రాన్ని కోరినట్లు చెప్పుకొచ్చారు. ఇక్కడి అనుకూలతలను ప్రత్యేకంగా వివరించినట్లు తెలిపారు. ఈ విషయంలో కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నమని అభిప్రాయపడ్డారు. పౌర సేవలను చివరి వ్యక్తి వరకు సమర్థవంతంగా అందించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఏఐ, బ్లాక్ చెయిన్ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీస్‌ను విరివిగా వినియోగించుకోబోతున్నాం. ఇటీవలి కాలంలో కీలకంగా మారిన డ్రోన్ టెక్నాలజీపై తెలంగాణ యువతకు ప్రత్యేకంగా శిక్షణనిచ్చి వారికి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కసరత్తు చేస్తున్నాం అని వివరించారు.

## పోలీస్ విభాగంలో ఉత్తమ బాక్సింగ్, క్రికెట్ కేంద్రాలు

మొదటి పేజీ తరువాయి

ఖ్యాతిని చాటి చెప్పిన బాక్సర్ నిఖత్ జరీన్, మహమ్మద్ సిరాజ్ క్రికెటర్‌లు ప్రస్తుతం టీజీఎస్పీ డీఎస్పీలుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిందని గుర్తు చేశారు. వారి ఆధ్వర్యంలో నైపుణ్యంతో కూడిన శిక్షణ ఇచ్చేందుకు టీజీఎస్పీ విభాగంలో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తద్వారా అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేస్తామన్నారు. టీజీఎస్పీ సిబ్బందికి శాంతి భద్రతల పరిరక్షణలోనూ, ఇతర రాష్ట్రాలకు వెళ్లి సేవలు చేసినందున వారికి ఎంతో పేరు ఉందన్నారు. ప్రస్తుతం శిక్షణ పూర్తి చేసుకున్న టీజీఎస్పీ సిబ్బందిని మాదకద్రవ్యాలను అరికట్టేందుకు, సైబర్ నేరాలను నియంత్రించేందుకు కూడా వినియోగిస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 4077 మంది టీజీఎస్పీ కానిస్టేబుల్‌లకు శిక్షణ ఇచ్చామని, యూసుఫ్‌గూడ బెటాలియన్‌లో 548 మందికి శిక్షణ పూ-ర్తయిందని తెలిపారు. భారీ స్థాయిలో టీజీఎస్పీ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు. ఈ రోజు నుంచి పోలీస్ విభాగంలో చేరుతున్న సిబ్బంది వారి తల్లిదండ్రులు గర్వపడేలా, రాష్ట్ర పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చే విధంగా పని చేయాలని డీజీపీ కోరారు. టీజీఎస్పీ అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్ మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన పోలీస్ శాఖలో పనిచేస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. శిక్షణ పూర్తి చేసుకున్న 4077 కానిస్టేబుల్‌లలో 2746 గ్రాడ్యుయేట్స్, 596 పోస్ట్ గ్రాడ్యుయేట్స్, 62 మంది ఎక్స్ సర్వీస్‌మెన్లు ఉన్నారని తెలిపారు.

## నాగోబా జాతరకు ముహూర్తం ఖరార్

మొదటి పేజీ తరువాయి

కేస్లాపూర్ గ్రామంలో ప్రతి ఏడూ వచ్చే పుష్య అమావాస్య రోజున జాతర ప్రారంభమవుతుంది. అప్పటి నుంచి 5 రోజుల పాటు జాతర ఘనంగా జరుగుతుంది. ఈ జాతరలో కీలమైన మూడోరోజు నిర్వహించే గిరిజన దర్బార్ ఈ నెల 31న జరగనుంది. జాతర ఏర్పాట్లకు సంబంధించి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఉట్నూరు ఐటీటీఏ పీవో ఖుష్బూగుప్తా, ఎస్పీ గౌష్ ఆలం, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ఇతర అధికారులు కేస్లాపూర్‌లో సమావేశమయ్యి, చర్చించారు. ఈసారి రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలను జాతరకు ఆహ్వానించాలని నిర్ణయించారు. జాతర పూర్తయ్యే వరకు కేస్లాపూర్ చుట్టుపక్కల 5 కి.మీ.ల పరిధిలో మద్యం విక్రయాలపై నిషేధం విధించనున్నారు. గురువారం నెలవంక దర్శనమివ్వడంతో తొలిఘట్టంగా ఏడు రోజుల పాటు సాగే ప్రచార రథం శుక్రవారం కేస్లాపూర్‌లో బయలుదేరనుంది.

## రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు



హైదరాబాద్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో పదేళ్ల పాటు రాష్ట్రాన్ని బీఆర్ఎస్ దోచుకుంటే ఇప్పుడు కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను పక్కనబెట్టి వ్యక్తిగత కక్షలను కాంగ్రెస్ నేతలు ప్రాధాన్యత ఇస్తున్నారని సీరియస్ అయ్యారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనేక హామీలు గుప్పించి రైతులను నట్టేట ముంచే ప్రయత్నం చేస్తోందని అన్నారు. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నేతల్లో మార్పు వచ్చింది తప్ప తెలంగాణ ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని తెలిపారు. కాంగ్రెస్‌ది ప్రజాప్రభుత్వం కాదని ప్రజలను మోసం చేసే ప్రభుత్వం అని అన్నారు. రైతుభరోసా లో అనేక కొర్రీలు పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు సంబంధించిన అన్ని వివరాలు ప్రభుత్వం దగ్గర ఉన్నాయని తెలిపారు. రుణమాఫీకి కోతలు పెట్టినట్లే రైతు భరోసాకు కూడా కోతలు పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఎరువుల ధరలు పెరిగినా కేంద్రం ఏనాడూ రైతులపై భారం వేయలేదని అన్నారు. పెరిగిన భారమంతా కేంద్రమే భరిస్తోందని తెలిపారు. కేంద్రం రైతు పక్షపాతిగా వ్యవహరిస్తోందని అన్నారు. ఎరువుల కోసమ రైతుల వద్దనుంచి నామమాత్రంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు పండించే పంట మొత్తాన్ని కేంద్రమే కొనుగోలు చేస్తోందని అన్నారు. కేజీ బియ్యాన్ని రూ.40కి కొనుగోలు చేసి పేదలకు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఎరువుల సబ్సిడీ కోసం కేంద్రం రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తోందని అన్నారు. అంతేకాదు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విద్యుత్ కోతలు లేని పరిస్థితి తీసుకొచ్చిందని అన్నారు. బీజేపీ హయాంలోనే ఎరువుల కొరత లేని పరిస్థితులు చూస్తున్నామని తెలిపారు. కానీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిండా ముంచుతోందని విమర్శించారు.

## 25 ఏండ్ల భవిష్యత్తు అవసరాలను మంచినీటి సరఫరాకు ప్రణాళిక

మొదటి పేజీ తరువాయి



చేసే ప్రణాళికలు ఉండాలన్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం హైదరాబాద్ జలమండలి బోర్డు సమావేశం జరిగింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోర్డు సమావేశం కావడం ఇదే తొలిసారి. సమావేశంలో సిటీ విస్తరణను దృష్టిలో పెట్టుకొని 2050 నాటి అవసరాలకు సరిపడేలా ఫ్యూచర్ ప్లాన్ ఉండాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇంటింటికీ తాగునీటితో పాటు సీవరేజీ ప్లాన్‌ను రూపొందించాలని, అవసరమైతే ఏజెన్సీలు, కన్సల్టెన్సీలతో అధ్యయనం చేయించాలని సూచించారు.

**మంజీరా పాత లైన్ వెంబడి కొత్త ప్రాజెక్టు.**

జలమండలి ఆదాయ వ్యయాలు ఆశాజనకంగా లేవని, వీటిని అధిగమించేందుకు ఆర్థిక శాఖ సమన్వయంతో తక్షణ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సంస్థ సొంత ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలన్నారు. కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకు అవసరమయ్యే నిధులను సమకూర్చుకోవాలని, తక్కువ వడ్డీతో రుణాలు తెచ్చుకునే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలన్నారు. అందుకు వీలుగా ప్రాజెక్టు డీపీఆర్లు తయారు చేయించాలని చెప్పారు. మంజీరా నుంచి సిటీలోకి నీటి సరఫరా చేస్తున్న మార్గాల్లో పాత లైన్ వెంబడి ప్రత్యామ్నాయంగా మరో అధునాతన లైన్ నిర్మించేలా ప్రాజెక్టు చేపట్టాలని అవసరమైతే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల జీవన్ మిషన్ ద్వారా నిధులు తెచ్చుకునేందుకు వీలుగా ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని సీఎం ఆదేశించారు.

**మల్లన్నసాగర్ నుంచే సిటీకి నీరు.**

హైదరాబాద్ తాగునీటి అవసరాలకు నిర్దేశించిన గోదావరి ఫేజ్-2 ప్రాజెక్టుకు మల్లన్నసాగర్ నుంచి నీటిని తీసుకోవాలా, కొండపోచమ్మ సాగర్‌ను నీటి వనరుగా ఎంచుకోవాలా అనే అంశంపై సమావేశంలో చర్చించారు. కన్సల్టెన్సీ ఏజెన్సీలు ఇచ్చిన రిపోర్టుతోపాటు నీటి లభ్యత ఎక్కువగా ఉండటం, లిఫ్టింగ్ వ్యయాన్ని దృష్టిలో పెట్టుకొని మల్లన్నసాగర్ నుంచే ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. గతంలో ప్రతిపాదించిన 15 టీఎంసీలకు బదులు, సిటీ అవసరాల దృష్ట్యా 20 టీఎంసీల నీటిని తెచ్చుకునేలా మార్పులకు ఆమోదం తెలిపారు. అలాగే గోదావరి ఫేజ్ -2 ద్వారా మరింత నీటిని తెచ్చుకొని ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ వరకు తాగునీటి సరఫరాకు డిజైన్ చేసిన ప్రాజెక్టుపై సమావేశంలో చర్చ జరిగింది.

## నేడు సమావేశంకానున్న రాష్ట్ర క్యాబినెట్

హైదరాబాద్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం శనివారం సాయంత్రం 4గంటలకు సచివాలయంలోని క్యాబినెట్ హాలులో జరగనుంది. ఈ సందర్భంగా ప్రధానంగా రైతు భరోసా అమలుపై చర్చ జరిగే అవకాశాలున్నాయి. సంక్రాంతి నుంచి రైతు భరోసాను అమలు చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే మంత్రివర్గ ఉప సంఘం దీనికి సంబంధించిన విధివిధానాలపై కసరత్తు చేసింది. పంట వేసిన ప్రతి రైతుకూ రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని గురువారం జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఇందుకోసం రైతుల నుంచి మళ్లీ దరఖాస్తులు స్వీకరించాలని మంత్రివర్గ ఉపసంఘం అభిప్రాయపడింది. ఈ అంశాలన్నింటిపై శనివారం జరిగే క్యాబినెట్ భేటీలో చర్చించనున్నారు. మరో ప్రధాన అంశమైన రేషన్ కార్డుల జారీపైనా క్యాబినెట్ చర్చించనుంది. ఇప్పటికే రేషన్ కార్డుల కోసం ప్రభుత్వం



దరఖాస్తులను ఆహ్వానించింది. వీటిని ఎప్పటి నుంచి జారీ చేయాలనే అంశంపై సమావేశంలో నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోంది. రైతు కూలీలకు రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చింది. ఆరు గ్యారెంటీలలో ఇది కూడా ప్రధానమైన అంశం. దీనిని అమలు చేయాలన్న యోచనలో ఉన్న ప్రభుత్వం.. క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిషన్ నివేదిక, ఎస్సీ ఉప కులాల వర్గీకరణ, కార్పొరేషన్లు, మున్సిపాలిటీల విలీనం తదితర అంశాలపై కూడా చర్చ జరగనుంది. తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగానే యాదగిరి గుట్టకు కూడా ఒక బోర్డును ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. దీనిపై క్యాబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# రైతుల కోసం పథకాలు

కొత్త ఏడాది రైతుల సంక్షేమానికి అనేక చర్యలు చేపట్టింది. ప్రకృతి వైపరిత్యాలతో తల్లడిల్లుతున్న రైతాంగాన్ని ఆదుకోవడానికి ప్రధాని ఫసల్ బీమా యోజన పరిధిని పెంచింది. ఇందుకు 69 వేల 515 కోట్లు ఈ పథకానికి కేటాయించింది. ఈ పథకంతో 4 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. అంతేకాకుండా పీఎం ఫసల్ బీమా యోజనలో మార్పులు చేశారు. 23 రాష్ట్రాలకు , 4 కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈ పథకంలో భాగస్వామ్యం ఉంది. అయితే బీమా చెల్లింపు విషయంలో ఈశాన్య రాష్ట్రాలకు 90 శాతం ప్రీమియంను కేంద్రమే భరించబోతోంది. మిగతా రాష్ట్రాల్లో 50 శాతం చెల్లిస్తారు.. మరోవైపు ఎరువులపై సబ్సిడీని పెంచింది కేంద్రం.. విపత్తు తీవ్రతను తగ్గించడానికి కృషి చేస్తునట్టు తెలిపారు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్.. ఈ సంవత్సరాన్ని రైతు సంక్షేమ సంవత్సరంగా ప్రధాని మోదీ ప్రకటించారని అన్నారు. ఫసల్ బీమా యోజన రైతు జీవితాల్లో గణనీయమైన మార్పును తెచ్చిందన్నారు. రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం 11.9 లక్షల కోట్లు గత పదేళ్లలో ఖర్చు చేసినట్టు వెల్లడించారు. అంతేకాదు 2025లో తొలి క్యాబినెట్ భేటీని ప్రధాని మోదీ రైతులకు అంకితం చేసింది కేంద్రంఇక డీఏపీపై అదనపు భారాన్ని కేంద్రమే భరించనుంది. ఇకపై ఒక 50 కిలోల డీఏపీ బస్తా 1350 రూపాయలకే లభ్యం కానుంది. కేంద్రం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా 4 కోట్ల మంది రైతులకు లబ్ధి చూకూరనుంది. అదేవిధంగా ఫండ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ'కి కేంద్రం రూ.800 కోట్ల నిధిని ఏర్పాటు చేసింది. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద అందించే మొత్తాన్ని రూ.6 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో నిర్వహించిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు.క్యాబినెట్ నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు ప్రధానిమోదీ. రైతుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉన్న ప్రభుత్వం తమదేనని.. దేశానికి అన్నం పెట్టేందుకు శ్రమించే మన రైతులు గర్వకారణమన్నారు. 2025 మొదటి క్యాబినెట్ భేటీని రైతుల శ్రేయస్సు కోసం అంకితం చేయడం?ఆనందంగా ఉందన్నారు మోదీ.2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేసి 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చింది. అయితే, భూస్థాయిలో ఉన్న వాస్తవాలు మాత్రం వ్యవసాయ విధానాల్లో ఉన్న లోపాలను, కార్పొరేట్ లాభాలను కాపాడే విధానాలను, ప్రతిపక్షాల గళాన్ని అణిచివేసే ప్రభుత్వ వైఖరిని వెల్లడించాయి. ప్రభుత్వం ప్రారంభంలోనే రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కొన్ని పథకాలను ప్రవేశపెట్టింది. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి వంటి పథకాలు రైతులకు ఏడాదికి రూ. 6,000 సాయం అందజేయడం ద్వారాఆర్థిక ఒత్తిడిని తగ్గించడమే లక్ష్యంగా ప్రవేశపెట్టబడ్డాయి.భూమి ఆరోగ్యకార్డులు, ప్రధానమంత్రి పంట భీమా యోజన వంటి పథకాలు సుస్థిర వ్యవసాయానికి, పంట నష్టాల నుంచి రక్షణకు ఉపయోగపడతాయని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులు, శీతల గిడ్డంగుల వంటి మౌలిక సదుపాయాలలో పెట్టుబడులు వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించే ప్రయత్నంగా గొప్పగా చాటుకున్నారు. కానీ, ఈ చర్యలు పరిమిత ప్రభావాన్ని మాత్రమే చూపించాయి. పిఎం కిసాన్ పథకం ద్వారా కొంతమంది రైతులకే లబ్ధి కలిగింది. అయితే కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు వంటి వారు పూర్తిగా ఈ పథకాల పరిధికి దూరంగా ఉన్నారు. పంట భీమా పథకాలు చాలా సందర్భాల్లో రైతులకు న్యాయమైన పరిహారం అందించలేక పోయాయి. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న లక్ష్యం దూరమైంది.జాతీయ నమూనా సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఒ) ప్రకారం, వ్యవసాయ కుటుంబం సగటు నెలసరి ఆదాయం కేవలం రూ. 10,218 మాత్రమే. ఇది బతుకుదెరువుకు సరిపడటం లేదు. 2020లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు ఈ సమస్యలను మరింతగా వేగవంతం చేశాయి. వీటిని సంస్కరణలుగా ప్రచారం చేసినప్పటికీ, రైతులు వీటిని తమ జీవనోపాధిపై నేరుగా దాడిగా చూశారు. కనీస మద్దతు ధర (ఎంఎస్పి) వ్యవస్థను బలహీనపరచడం, వ్యవసాయ మార్కెట్లను కార్పొరేట్ సంస్థలకు అందుబాటులోకి తీసుకురావడం వంటి అంశాలు చిన్న రైతులను పెను ప్రమాదంలోకి నెట్టేశాయి. ఈ చట్టాలపై రైతుల నిరసనలు విరుచుకుపడ్డాయి. ముఖ్యంగా పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్ ప్రాంతాల రైతులు ఢిల్లీకి చేరి ఏడాదిన్నర పాటు శాంతియుత నిరసనలు కొనసాగించారు.కానీ ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడానికి బదులుగా, కఠినమైన చర్యలను తీసుకుంది. నిరసనకారులపై టియర్ గ్యాస్, వాటర్ కాన్నన్‌లు వాడటంతో పాటు, 750 మందికి పైగా రైతులు అకాల మరణాల పాలయ్యారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చివరికి ఈ చట్టాలను 2021 నవంబరులో వెనక్కి తీసుకున్నప్పటికీ, రైతుల ప్రధాన డిమాండ్లలో ఒకటైన స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను ఇప్పటికీ అమలు చేయలేదు. పంటల ఉత్పత్తి ఖర్చును 1.5 రెట్లు ఎంఎస్పిగా నిర్ణయించడం వంటి అంశాలు ఇంకా ఎదురుచూస్తూనే ఉన్నాయి.రైతుల ఆర్థిక సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. భారత దేశంలో 86 శాతం మంది రైతులు రెండు హెక్టార్ల కంటే తక్కువ భూమిని కలిగి ఉన్న చిన్న రైతులే. వీరు పెరుగుతున్న ఖర్చులు, సంస్థాగతరుణాల లభ్యతలో లోపం, మార్కెట్ లో అస్థిరత వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు ప్రభుత్తం తన ప్రాధాన్యతలను మారుస్తూ, రైతు జీవనోపాధిని సురక్షితంగా చేయడానికి దిశానిర్దేశం చేయాలి. వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులకు పథకాలు అందుబాటులోకి తెచ్చి, ఆర్థిక న్యాయం చేయాలి. రైతుల డిమాండ్లను తీర్చి, సమర్థనీయమైన వ్యవసాయ విధానాలను అమలు చేయడం ద్వారా మాత్రమే ఒక ప్రజాస్వామ్య భారతదేశం ఆవిర్భవించగలదు.

# జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విస్తృత పర్యటన

**– చేసిన సెంట్రల్ లైటింగ్ ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జనవరి 03 (తీన్మార్ న్యూస్): జిల్లా పర్యటన సందర్భంగా సుజాతనగర్ మండలంలోని వేపలగడ్డ గ్రామం నుండి బృందావనం వరకు ఆర్%ఒ%బి నిధులతో 2 కోట్ల వ్యయంతో మూడు కిలోమీటర్ల వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ను ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మరియు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లో ముందు ఉంది అని అన్నారు. ఏజెన్సీ ప్రాంతమైన కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధి లో వెనుకబడి ఉందని అన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతామని అన్నారు. కొత్తగూడెం శ్రీ రామచంద్ర కళాశాలలో సావిత్రిబాయి పూలే జన్మదినం సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి మూడో తారీఖున రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం గా ప్రకటించడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం లో భాగంగా 657 కోట్ల రూపాయలు ఖర్చుతో అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించాము. గత ప్రభుత్వం హాస్టల్ పిల్లలకు ఇవ్వని మౌలిక వసతులు మా ప్రభుత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని హాస్టల్స్ లో 200 శాతం కాస్మొటిక్ చార్జీలు పెంచడం జరిగింది. జిల్లాలో రామవరం ప్రాంతంలో ఎయిర్పోర్ట్ ఏర్పాటు కోసం కృషి చేస్తాను, అందుకోసం కొత్తగూడెం రుద్రంపూర్ ప్రాంతంలోని సింగరేణి, అటవీ, ప్రవేట్ భూములను ఏర్పాటు చేసుకొని రాబోవు ఆరు నెలల్లో కొత్తగూడెంలో ఎయిర్ పోర్ట్ ఏర్పాటు చేస్తాం.



సింగరేణి కొత్తగూడెం ప్రాంతంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తాను. కొత్తగూడెంలో ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియం కోసం కృషి చేస్తాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ రాజ్యం సాధించుకొని ప్రతి ఆడబిడ్డకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట ఏయాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేయడం జరిగింది. గత ప్రభుత్వం ప్రభుత్వ హాస్టల్లో చదువుకున్న పేద విద్యార్థులకు కనీసం భోజనం పెట్టలేని పరిస్థితి ఈనాడు ఇందిరమ్మ రాజ్యంలో కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి కలెక్టర్ ప్రత్యేక చొరవ జిల్లాలో విస్తృతంగా పర్యాటక రంగం అభివృద్ధి చేయాలనే ప్రత్యేక ఆలోచనలతో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చొరవతో ఈ ఏరు పండగను రూపొందించడం జరిగిందన్నారు. ఈ పండుగను జనవరి 9న వైకుంఠ ఏకాదశి శుభదినం సందర్భంగా మరియు ఆలయంలో



ఉత్తర ద్వార దర్శనం ప్రారంభం సందర్భంగా నిర్వహిస్తున్నారు. ఏరు అనేది ఈ జిల్లాలో మాట్లాడే గిరిజన భాషలో "నీరు" అని అర్థం. ఈ పేరు గోదావరి నది మరియు ఘాట్ల చుట్టూ నిర్వహించే వేడుకలను ప్రతిబింబించేందుకు ఎంపిక చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆలోచనలో భాగంగా, ఈ పండుగ భద్రాచలం కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం ఆలయం, గోదావరి నది మరియు బోటింగ్, కనకగిరి శిఖరం, గిరిజన గ్రామ అనుభవం, కిన్నెరసాని డ్యామ్ మరియు జింకల పార్కు వంటి పర్యాటక ప్రదేశాలపై దృష్టిని సారించేందుకు ప్రత్యేకంగా ఉంటుంది. అనంతరం పాల్వంచ మండలం రెడ్డిగూడెం గ్రామంలో 1 కోటి 70లక్షల రూపాయలతో హై లెవెల్ బ్రిడ్జి కు మంత్రి శంకుస్థాపన చేశారు. పాల్వంచ బైపాస్ రోడ్డుకు కొరకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి సీతారాంపట్నం నుండి పాండురంగాపురం గ్రామం వరకు 10 కోట్ల రూపాయల వ్యయం తో పాండురంగాపురం బ్రిడ్జి వద్ద మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ,ఐటీడీఏ పీవో రాహుల్ మరియు ఇతర శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

# అధ్వానంగా పల్లె దారులు

**– పల్లె రోడ్ల ప్రయాణం నరక యాతన**
**– వాహనదారులకు ప్రజలకు తప్పని ఇక్కట్లులి**
**–ఓవైపు కంప చెట్లు – మరోవైపు గుంతల రోడ్లు**
**– భయం భయంగా ప్రయాణం**

దేవరకద్ర, జనవరి 03(తీన్మార్ న్యూస్): పల్లెలే రాష్ట్ర ప్రగతికి, దేశాభివృద్ధికి పట్టుకొమ్మలు అంటారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం పల్లెల్లోనే ఉండాలని గొప్ప గొప్ప నేతలు కలలు కన్నప్పటికీ అవి కలలుగానే నిలిచిపోయాయి. కంప్యూటర్ యుగంలో మనిషి పోటీపడి మేధాశక్తిని పెంపొంది అంతరిక్షంలో అడుగుపెడుతున్న ఈ రోజుల్లో పల్లెలకు రవాణా సౌకర్యం లేక మండల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని పలు గ్రామాలలో పాలకులు, అధికారులు రవాణా సౌకర్యం పై శ్రద్ధ చూపకపోవడంతో రహదారులు అద్వానంగా మారాయి. కానీ ప్రభుత్వం గ్రామీణ రోడ్ల విషయం గాలికొదిలేసిందనే మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. పల్లెల్లో కనిపిస్తున్న రహదారులే అందుకు నిదర్శనం. రెండు నిమిషాల ప్రయాణం కూడా సాఫీగా సాగని పరిస్థితి ఉందని అంటున్నారు. అడుగేస్తే మడుగు అనే అంతలా పరిస్థితి ఉంది. అక్కడ రోడ్డు ఉందా అనిపించే దారులు మండలంలో లెక్కలేనన్నీ ఉన్నాయని కోరుతున్నారు.రోడ్డు నిర్మాణం, మరమ్మతులపై పాలకులు ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయి. ఒకవైపు కంకర తేలిన రోడ్లు, మరోవైపు గుంతలమయమైన రోడ్లు,ఇంకోవైపు బురద రోడ్లు మండలంలో ఏ దారిలో వెళ్లినా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. రహదారులు ప్రమాదకరంగా మారాయి. రోడ్లపై నుంచి ప్రజా ప్రతినిధులు, అధికారులు వెళ్తున్నా వాటి మరమ్మతుల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రి వేళ వాహనాలపై వెళ్లాలంటే భయమేస్తోందని వాహనదారులు చెబుతున్నారు. ఎన్నోసార్లు కింద పడి గాయాలయ్యాయని వాహన



దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు, కళాశాలలకు గ్రామీణ విద్యార్థులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దారుల్లో కొంతదూరం వెళితే ఒళ్లు గుల్ల అవుతోందిని, కాస్త ఆదమరచిన గోతుల్లో పడి కాళ్లు,చేతులు విరుగుతున్నాయని చెప్తున్నారు. ఇక గర్భిణులు ఆస్పత్రులకు వెళ్లాలంటే ఏ క్షణం ఏం జరుగుతుందోనని భయపడాల్సి వస్తోందని ఆరోపణలు చేస్తున్నారు.

**పట్టించుకోని అధికారులు ప్రజా ప్రతినిధులు**

మండలంలో గ్రామీణ రోడ్లు అద్వానంగా ఉన్నా, పాలకులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎన్నికల సమయంలో నాయకులు ఓట్ల కోసం ఈ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీలు గుప్పించినా, ఎన్నికల అనంతరం పట్టించుకోవడం లేదని అంటున్నారు. గ్రామీణ రోడ్ల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా మారింది. వర్షాకాలంలో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. పల్లెసీమలంటే పచ్చని చెట్లు, చల్లని గాలులు ఇవన్నీ ఒకప్పటి మాటలు.మరి ఇప్పుడో పల్లెకు వెళ్లే రోడ్లపై అడుగడుగునా గుంతలు వాటిపై వెళ్తే విరిగే నడుములు పట్టపగలు వెళ్లాలంటేనే చుక్కలు కనిపించే పరిస్థితులు ఆరోపణలు.కొన్నేళ్లుగా కనీస నిర్వహణ



లేక,మరమ్మతులకు నోచక, గుంతలనైనా పూడ్చకపోవడంతో రోడ్లన్నీ అత్యంత ప్రమాదకరంగా, భయానకంగా మారాయి. వర్షం పడితే ఇక పరిస్థితి అగమ్యమే.ఈ రోడ్లమీద వెళ్లే ఆటోలు,ఇతర వాహనాలు అతి తక్కువ సమయంలోనే దెబ్బతింటుండటంతో వాళ్లకు వచ్చే ఆదాయంలో ఎక్కువ మొత్తం మరమ్మతులకే పోతోందని కోరుతున్నారు. పల్లెల నుంచి వ్యవసాయ ఉత్పత్తుల్ని తరలించాలన్నా, సాగుకి అవసరమైన ఎరువులు వంటివి తెచ్చుకోవాలన్నా ఈ అధ్వానపు రోడ్ల మూలంగా ఖర్చు తడిసి మోపెడవుతోంది. గ్రామాల అభివృద్ధికి రహదారులు మూలస్తంభంగా ఉంటాయని అంటారు. ఒక వైపు గుంతలు రోడ్డుకు కమ్మేసిన కంప చెట్లు తో వాహన దారులను హడలెత్తిస్తున్నాయి. కంప చెట్లు కండ్లకు, ముఖానికి తగిలి గాయాలు అవుతున్నాయని ఆవేదన వ్యకం చేస్తున్నారు. పత్రికలలో నెలకొకసారి రోడ్ల గురించి కథనాలు వస్తున్నా స్పందన లేదని వాహనదారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా గ్రామాలకు వెళ్లే రోడ్ల స్థితిగతులు మాత్రం మారడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్లను మరమ్మతులు చేయాలని వేడుకుంటున్నారు.

# మహనీయుల స్ఫూర్తి, ఆశయాలతో ముందుకు సాగాలి

**– జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**
**– కలెక్టరేట్ లో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు**

ములుగు జిల్లా, జనవరి 03 (తీన్మార్ న్యూస్): మహనీయుల స్ఫూర్తి, ఆశయాలతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జీ సంపత్ రావు ఇతర అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలోనూ తన భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో సావిత్రిబాయి చదువు నేర్చుకుని ఉపాధ్యాయురాలు అయ్యారని గుర్తు చేశారు. విద్యను అభ్యసిస్తేనే స్త్రీ విముక్తి సాధ్యమవుతుందని గ్రహించిన సావిత్రిబాయి, సాటి మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో బాలికలపాఠశాలను ప్రారంభించి మహిళా చైతన్యానికి బాటలు వేశారని, తద్వారా ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయు రాలిగా కీర్తి గడించారని అన్నారు. అస్పృశ్యత, అంటరాని తనం, కులవివక్షత వంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించేందుకు పూలే దంపతులు చేసిన పోరాటం, చూపిన తెగువ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆనాటి ఆధిపత్య వర్గాల సామాజిక కట్టుబాట్ల కారణంగా ఎన్ని అవాంతరాలు ఎదురైనా, వాటిని లెక్కచేయకుండా మహిళల విద్యాభివృద్ధికి అకుంఠిత దీక్షతో కృషి చేసిన ధీశాలి సావిత్రిబాయి పూలే అని ప్రశంసించారు. ఆ మహనీయురాలి స్ఫూర్తితో మహిళల అభ్యున్నతి కోసం కృషి చేయాలని, అప్పుడే ఆమె ఆశయ సాధనకు కృషి చేసినట్లు అవుతుందని అన్నారు. ఈ సమాజంలో ప్రస్తుత పరిస్థితుల్లో కూడా కొన్ని విషయాల్లో వివక్షకు గురవుతున్న క్రమంలో వాటిని





రూపుమాపాల్సిన బాధ్యత కూడా అందరిపై ఉందని కలెక్టర్ తెలిపారు. సావిత్రిబాయి సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఇకనుండి ఆమె జయంతిని పురస్కరించుకుని ప్రతియేటా జనవరి 3 వ తేదీన మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించిం దని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయిను లుగా ఎంపికైన శ్రీమతి జి. నీరజ, వి. జ్యోతి, జె. మమత, టి. రాధిక, కే. భాగ్యలక్ష్మి, కె. జయశ్రీ, సిహెచ్. రాణి, ఎల్. పద్మ, వి. రమాదేవి, పర్వతాల రమాదేవి, సిహెచ్. మాధురి దేవి, ఏ. మధురిమ, కే. సునీత, జి. లక్ష్మి, పద్మావతి, రిజ్వానా కౌసర్ బేగం, ఏం. సమ్మక్క, బి. సుమలతాదేవి లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిసిఇబి కార్యదర్శి ఈ సూర్యనారాయణ, జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు అర్షం రాజు, కాటం మల్లారెడ్డి, గుల్లపల్లి సాంబయ్య, జి రమాదేవి, మండల విద్యాశాఖ అధికారులు సామల శ్రీనివాసులు, కేశవరావు, కొయ్యడ మల్లయ్య, మేనక, వెంకటేశ్వర్లు వివిధ ఉపాధ్యాయ సంఘాల జిల్లా బాధ్యులు మరియు జిల్లాలోని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో కాంస్య పతకాలు



ములుగు, జనవరి 03 (తీన్మార్ న్యూస్): సీఎం కప్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో ములుగు జిల్లాకు చెందిన విద్యార్థులు కాంస్య పతకాలు సాధించినట్లు బాక్సింగ్ కోచ్ మామిడిపెల్లి రమేష్ తెలిపారు, డిసెంబర్ 31 నుండి ఈ నెల 2 వరకు హైదారాబాద్ లోని (ఎల్బీ స్టేడియం) లాల్ బహుదూర్ స్టేడియంలో జరిగిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో ములుగు జిల్లాలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలకు చెందిన నవీన (50కేజీల విభాగంలో), సోనియా (46కేజీల విభాగంలో) అత్యంత ప్రతిభ కనబరిచి కాంస్య పతకాలు సాధించారని కోచ్ రమేష్ తెలిపారు, వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ నర్మద భాయ్, వ్యాయామ ఉపాధ్యాయులు త్రివేణి, శ్రీలత, ఉపాద్యాయులు, విద్యార్థులు అభినందించారు.

# బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం చెక్కును అందజేసిన మాజీ ఎమ్మెల్యే చల్లా

పరకాల, జనవరి 03 (తీన్మార్ న్యూస్): గీసుగొండ మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త దౌడు బాబు ప్రమాదవశాత్తు ఇటీవలే మరణించగా అయన భార్య శారదకి కేసిఆర్ ప్రవేశ పెట్టిన పార్టీ సభ్యత్వం 2 లక్షల రూపాయల భీమా చెక్కును పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి శుక్రవారం హనుమకొండలోని ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ రాజకీయ పార్టీ కూడా కార్యకర్తలకు భీమా సదుపాయం కల్పించలేదని అన్నారు.మొదటగా బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తకు భీమా సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్త అకాల మరణం చెందితే వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే సదుద్దేశంతో కేసీఆర్ భీమా సదుపాయం ప్రవేశ పెట్టారని తెలిపారు.అదేవిధంగా పార్టీ పటిష్టత కోసం కృషిచేస్తున్న ప్రతి



కార్యకర్తను కంటికిరెప్పలా కాపాడుకుంటానని, వారికి అండగా ఎల్లపుడు ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు పోలీస్ ధర్మారావు, చల్లా వేణుగోపాల్ రెడ్డి,పుండ్రు జైపాల్ రెడ్డి, గుర్రం రఘు, బోడకుంట్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వమానవాళి సుఖసంతోషాలతో జీవించాలి

## మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, జనవరి 03 (తీన్మార్ న్యూస్): భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం రోజున బాలసముద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో అజ్మీర్ ఖాజా గరీబ్ నవాజ్ రహమతుల్లా అలయ్ దర్గా కు గిలాఫ్ ను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. ప్రతీ సంవత్సరం కేసీఆర్ గారు, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గిలాఫ్ ప్రతీ ఏటా పంపేవారమని, ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ పార్టీ హనుమకొండ జిల్లా పక్షాన సైతం గిలాఫ్‌ను పంపిస్తున్నామని వినయ్ భాస్కర్ తెలిపారు. అల్లా అందరిని క్షేమంగా చూడాలని ప్రార్థించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు నయీమొద్దీన్, ఎండీ పాషా, అన్వర్ అలీ, ఎండీ అఫ్జల్, ఎండీ ఇస్మాయిల్, ఎండీ సిరాజ్, ఎండీ ఖలీల్, తస్లీమ్, నయీమ్, అక్బర్, ఫకీర్, రహీమ్, అఫ్రీన్, బియా, సమ్దాని, సర్దార్, యాకుబ్,



అబ్దుల్లా ఖాన్, హుస్సేన్, అన్వర్, షకీల్, మహమూద్ ఖిలే, అజారుద్దీన్, అహ్మద్, పార్టీ శ్రేణులు పులి రజినీకాంత్, పబ్బోజు శ్రీకాంత్ చారీ, బచ్చు అనిల్ కుమార్, బైరపాక ప్రశాంత్, చాగంటి రమేష్, శ్రీనివాస్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రి బాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

## ఉపాధ్యాయులు ఉన్నత విద్యను అందించాలి

## శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 03 (తీన్మార్ న్యూస్): సావిత్రి బాయి పూలేను ఆదర్శంగా తీసుకొని ఉపాధ్యాయులు ఉన్నత విద్యను అందించాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి కార్యాలయంలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా, మహిళల చదువు కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి సావిత్రి బాయి పూలే అని అన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి జన్మదినాన్ని మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. మహిళల జీవితాల్లో గొప్ప మార్పు తెచ్చారని, నేడు దాదాపు 50 శాతంపైగా మహిళలు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మగవాళ్ళకంటే ఏమి తక్కువ కాదని నేడు అన్ని రంగాలలో ఎన్నో ఉన్నత స్థానాలలో మహిళలు అద్భుతంగా రాణిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం విద్యా, వైద్య రంగాల ను రెండు కళ్ళుగా భావించి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు ప్రారంభం నాడే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫార్మ్ ఇచ్చామని తెలిపారు. నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం 1 నుండి 10 వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలను హాస్టళ్లుగా మార్చాలన్న ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రయివేటు కంటే మిన్నగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యానోదన అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రానున్న రోజుల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరాలన్న లక్ష్యంతో ప్రభుత్వం యంగ్ ఇండియా మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అద్దె భవనాల్లో ఉన్న సంక్షేమ హాస్టళ్లుకు శాశ్వత భవనాలు నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. మట్టిలో మాణిక్యాలను కలెక్టర్లు





గా, ఎస్పీలుగా తీర్చిదిద్దాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఆనాడే మహిళా విద్యకు ప్రాధాన్యత ఇచ్చిన గొప్ప వ్యక్తి సావిత్రి బాబు పూలే అని అన్నారు. మహిళల పట్ల వివక్షత ఉన్న రోజుల్లో విద్య యొక్క ప్రాధాన్యతను గుర్తించి మహిళల కొరకు ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేసిన మహానుబావురాలని కొనియాడారు. సావిత్రి బాయి జయంతి ని పురస్కరించుకుని ఆమె త్యాగానికి గుర్తింపుగా ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించినట్లు తెలిపారు. దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా అణగారిన వర్గాల మహిళలకు అక్షర జ్యోతి వెలిగించిన మహనీయురాలిని ఆశయాలతో ముందుకు వెళ్లాలని సూచించారు. మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం చాలా సంతోషమని ఇది మహిళలకు లభించిన గౌరవమని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ మహిళా ఉపాధ్యాయులను శాలువా, మెమేంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, కౌన్సిలర్లు, మహిళా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మహిళ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే సావిత్రిబాయి పూలే ఆశయం

## జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి

మహబూబాబాద్ జిల్లా, జనవరి 03 (తీన్మార్ న్యూస్): మహిళా సాధికారతే సావిత్రిబాయి పూలే ఆశయమని ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి పురస్కరించుకొని మహబూబాబాద్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) లో ఇన్చార్జి స్పెషల్ ఆఫీసర్ వై గాయత్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ భారతదేశంలో సావిత్రిబాయి పూలే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలని వారు బాలికల చదువుకోరకు తన భర్త మహాత్మ జ్యోతిబాపూలే తను చదువు నేర్చుకుని. బాలికల పాఠశాలను ఏర్పాటు చేసి బాలికల చదువు నేర్పిన ఘన చరిత్ర ఉందని, సావిత్రిబాయి పూలే స్ఫూర్తిని తీసుకో వాలని ఆయన సూచించారు. బాలికల చదువు ప్రాధాన్యతను వారి ఎదుగుదల, భవిష్యత్తు గురించి నేటి బాలికల సాధికారత రేపటి మహిళా సాధికారతకు పునాది వంటిదని ఆయన



అన్నారు. బాలికల చదువు కొరకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరారు. అనంతరం జిసిడిఓ, ఎస్ఓ, ట్రైనీ ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిసిడిఓ విజయ కుమారి, ఏసీజీ మందుల శ్రీరాములు, ఎంఈఓ వెంకటేశ్వర్లు, పలువురు ట్రైనీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# వనపర్తి లో ట్రాఫిక్ నిబంధనలు కఠినం

## 60 నెంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్

## సీఐ పర్యవేక్షణలో వాహనాల తనిఖీలు





వనపర్తి జిల్లా, జనవరి 03 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా కేంద్రంలో పాటు వనపర్తి సర్కిల్ పరిధిలో ఎక్కడైనా కూడా వాహనదారులు తమ తమ వాహనాలకు నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వనపర్తి సీఐ కృష్ణ హెచ్చరించారు. శుక్రవారం వనపర్తి రూరల్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో వనపర్తి రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ సురేంద్ర ట్రాఫిక్ ఏఎస్ఐ నిరంజన్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. నెంబర్ ప్లేట్ లేని 60 వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించినట్లు సిఐ



తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలతో పాటు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని, త్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడుపుతే కటకటాల పాలు చేస్తామని సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ హెచ్చరించారు, వనపర్తి జిల్లా కేంద్రంలో ఈ మధ్యకాలంలో చిన్న పిల్లలు కూడా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారని విచ్చలవిడిగా లైసెన్సు లేకుండా పిల్లలకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై చర్యలు తీసుకుంటామని ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరిస్తూ వనపర్తి జిల్లాలో ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని సీఐ విజ్ఞప్తి చేశారు, పోలీసులు చేస్తున్న ప్రయత్నం ప్రజల కోసం ఎంతో మేలు చేస్తుందని ఈ విషయం ప్రతి ఒక్కరు గమనించాలని ప్రాణాలను చేతులారా పోగొట్టుకోకుండా విచ్చలవిడి డ్రైవింగ్ మద్యం సేవించడం వంటి సంఘటనలు జరుగుతున్నాయని ఇందుకోసమే పోలీసులు ఎప్పటికప్పుడు ట్రాఫిక్ రూల్స్ నిబంధనలను కఠినం చేయడం జరుగుతుందని తెలిపారు.

# మెగా జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

ములుగు జిల్లా, జనవరి 03 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఈజిఎంఎం ఎంప్లాయ్మెంట్ జనరేషన్ మార్కెటింగ్ మిషన్ ద్వారా జనవరి 07న పీఎస్ఆర్ గార్డెన్స్ సోమలగడ్డ క్రాస్ రోడ్ చల్వాయి గోవిందరావుపేట మండలం ములుగు జిల్లా నందు అర్హత ఆసక్తి గల యువతకు వివిధ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టి .ఎస్. శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యొక్క మెగా జాబ్ మేళా గౌరవ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కచే ప్రారంభోత్సవం చేసి జిల్లాలో గల నిరుద్యోగ యువతీ యువకులు పదవ తరగతి నుండి పీజీ వరకు ఉత్తీర్ణత అయిన వారికి వివిధ 50 ప్రైవేటు కంపెనీల నందు నేరుగా ఉద్యోగాలు కల్పిస్తూ మరియు 30 రోజులు శిక్షణ ఇస్తూ అనంతరం ఉద్యోగ అవకాశం కల్పించే సంస్థలు ములుగు మెగా జాబ్ మేళాకు హాజరై వివిధ సెక్టార్లు అనగా ఐటీ సెక్టర్, నెట్వర్క్ ఇంజనీర్, బ్యాంకింగ్ సెక్టార్ ,ఫార్మసీ మెకానికల్ ఇంజనీర్, నెట్వర్క్ ఇంజనీర్, క్వాలిటీ ఇంజనీర్, క్వాలిటీ మెకానికల్ ఇంజనీర్, అసెంబ్లీ ఆపరేటర్ ఎం.ఐ .ఎస్. ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్ రిలేషన్షిప్ ఎగ్జిక్యూటివ్ ఫైనాన్స్ ఇంటర్న్షిప్, ఆడిట్ అసిస్టెన్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, మిషన్ ఆపరేటర్, జూనియర్ అసిస్టెంట్, ఫీల్డ్ టెలికాలర్, కస్టమర్ సేల్స్, సెక్యూరిటీ గార్డ్, సేల్స్ ఆఫీసర్, స్కాన్ కోడ్ అసిస్టెంట్, డెలివరీ బాయ్స్ మొదలగు సుమారు 15000 ఉద్యోగాలను ప్రైవేట్ సంస్థల ద్వారా భర్తీ చేసి రాష్ట్రంలోని వివిధ పట్టణ ప్రాంతాలలో నెలకొని ఉన్న ప్రైవేటు కంపెనీలలో ములుగు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకుల ద్వారా ఈ యొక్క ఖాళీలను భర్తీ చేయుటకు కంపెనీహా ప్రతినిధులు ముందుకొచ్చారనీ ఈ అవకాశాన్ని జిల్లా లోని నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

# ఉన్నత విద్యా మండలి చైర్మన్ హామీని నిలబెట్టుకోవాలి

## – కేయూ కాంట్రాక్ట్ అధ్యాపక సంఘ కోఆర్డినేషన్ కమిటీ

వరంగల్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ గత కొన్ని రోజుల ముందు ఉన్నత విద్య మండలి చేసిన ధర్నా చేసిన సందర్భంగా ఉన్నత విద్యా మండలి చైర్మన్ హామీ మేరకు తమ ఆందోళన విరమించుకున్నామని, వర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతామని హామీ ఇచ్చిన ఉన్నత విద్యా మండలి చైర్మన్ మాటను నిలబెట్టుకోవాలని కోరుతూ నేడు కాకతీయ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అధ్యాపక సంఘం నేతలు ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపక సంఘ కోఆర్డినేషన్ నేతలు, డా. బి. సతీష్, డా. మాదాసి కనకయ్య, డా. జూల సత్య, డా. సాదు రాజేష్ తదితరులు మాట్లాడుతూ వర్సిటీల్లో గత 20 సంవత్సరాలుగా పైగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం జూనియర్, డిగ్రీ మరియు పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులను రెగ్యులర్ చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుతం యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులకు కూడా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఇతర రాష్ట్రాలలో యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్





చేసిన విధంగానే తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీ కాంటాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేయాలని వర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు కోరడం జరిగింది. రెగ్యులరైజేషన్ ప్రక్రియ ఆలస్యమైతే, బేసిక్ పే, డీఏ హెచ్ఆర్ఏ మరియు ప్రతి సంవత్సరం మూడు శాతం వేతన ఇన్క్రిమెంట్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం విశ్వవిద్యాలయాల నియామకాలు చేపట్టే ప్రక్రియలో ఉన్న నేపథ్యంలో, గత రెండు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న అధ్యాపకులకు సరైన న్యాయం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. రఘువర్ధన్ రెడ్డి, డా. సూర్య నారాయణ, డా. చంద్రశేఖర్,డా. వెంకటేశ్వర్లు, డా. చందులాల్, తదితరులు పాల్గొన్నారు.

# చదువుల తల్లి సావిత్రి భాయి పూలేకి ఘణనివాలి

## – అన్ని కేంద్రాలల్లో సావిత్రి, జ్యోతిభా పూలేల విగ్రహాల ఏర్పాటు చేయాలి

## – జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్

చిన్నకోడూర్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర భారతదేశానికే ఆదర్శమని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం రోజు సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు మేడికాయల వెంకటేశం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్ మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య ఎంపిటిసిల ఫోరం మాజీ మండల అధ్యక్షులు ఇట్టబోయిన శ్రీనివాస్ లు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడుతూ మహిళ హక్కుల కోసం కుల వివక్ష విముక్తి కోసం సావిత్రిబాయి పూలే అనేక పోరాటాలు చేశారని అదేవిధంగా మహిళా అభ్యున్నతి కోసం తన భర్త జ్యోతిబాపూలే వద్ద చదువు నేర్చుకుని మహిళా పాఠశాల నెలకొల్పి మహిళలోకానికి అక్షరాలు నేర్పి భారత



దేశంలో మహిళలను అగ్రగామిగా నిలిపిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని వారు అన్నారు అగ్రకుల వ్యవస్థ సావిత్రి బాయి పైన కుట్రబోని మహిళలకు చదువు చెప్పకుండా చేయాలని ఆమెను అవమానిస్తూ దుర్భాషలాడుతూ పేడ నీళ్లు సైతం పైన పోసిన మొక్కవోని దీక్షతో స్త్రీ జాతి విముక్తి తన ధ్యేయమని సంకల్పించి ముందు నడిచి పోరాటం చేసి అక్షరాలను తీర్చిదిద్దిన వీర వనిత సావిత్రిబాయి పూలే అన్నారు ఇట్టి కార్యక్రమంలో జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, మేడికాయల వెంకటేశం, కాముని శ్రీనివాస్, కీసరి పాపయ్య, ఇట్టబోయిన శ్రీనివాస్, గాలిపల్లి లక్ష్మణ్, కొండం రవీందర్ రెడ్డి, ఏలేటి వెంకటరెడ్డి, పడిగే లింగం, తిరుపతి రెడ్డి,వాసు, డీలర్ రాజు, కొరవేణి అంజయ్య, బెజ్జంకి తిరుపతి తదితరులు ఉన్నారు.

# ఎంఎల్హెచ్పి అభ్యర్థుల ప్రొవిజనల్ జాబితాపై అభ్యంతరాలను తెలపాలి

## జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మల్లిఖార్జునరావు వెల్లడి

జనగామ జిల్లా, జనవరి 03 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జనగామలో (09) పోస్టుల భర్తీ కొరకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి 2024, డిసెంబర్ 19వ తేదీ వరకు స్వీకరించిన దరఖాస్తులకు సంబంధించి ప్రొవిజనల్ లిస్ట్ లను జిల్లా అధికారిక వెబ్ సైట్ https://jangaon.telangana.gov.in/ / లోను, వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయపు నోటీస్ బోర్డ్ లో తేదీ.04-01-2025న ఉంచనైనదని తెలియజేసారు. అందుకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే, అభ్యంతరములకు సంబంధించిన అవసరమైన తగిన ధ్రువపత్రాలను జతపరచి జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో తేదీ.07-01-2025 సాయంత్రం 5.00 గంటల లోపు స్వయంగా సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కోరారు.

# సావిత్రీబాయి ఫులే ఆశయాలు సాదించాలి

## ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్

హనుమకొండ, జనవరి 03 (తీన్మార్ న్యూస్): దేశంలో మహిళలకోసం సావిత్రీబాయి ఫులే చేసిన పోరాటం చాలా గొప్పదని ఆమె ఆశయాలకోసం అందరూ పని చేయాలనీ కృషి చేయాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్ అన్నారు. సావిత్రీ బాయి ఫులే జయంతి సందర్బంగా కాకతీయ యూనివర్సిటీ ఎస్డిఎల్సి ప్రాంగణం దగ్గర ఉన్న సావిత్రి భాయ్ పూలే విగ్రహానికి ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. దేశంలోమహిలకోసం పూలేదంపతులు మొట్టమొదటి సారి పాఠశాలాలను ఏర్పాటు చేసి చదువు నేర్పిన గొప్ప వ్యక్తి సావిత్రి భాయ్ పూలే అని కొనియాడారు సావిత్రి భాయ్ పూలే చదువు చెప్పడానికి మహిళ దగ్గరికి వెళ్తున్న క్రమంలో అగ్రకులలాకు చెందిన కొందరు వ్యక్తులు సావిత్రి భాయ్ పూలే మీద దాడి చేసి పేడ గుడ్లు కొట్టిన కానీ వెనకడుగు వేయకుండా మహిళల దగ్గరికి వెళ్లి చదువు నేర్పిన గొప్ప వ్యక్తి సావిత్రి భాయ్ పూలే గారు అని అన్నారు సావిత్రి భాయ్ పూలే



ఆశయాలుసాధించడం కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలనీ కోరారు ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ కెయూ అధ్యక్షులు దూడపాక నరేందర్ ప్రధాన కార్యదర్శి బండారి పృథ్వీ రాజ్ నాయకులు అజయ్ రాకేష్ బాలు గణేష్ రాజ్ తదితరులు పాల్గొన్నారు

# చదువుల తల్లి సావిత్రిభాయి పూలె ఆశయ సాధన కోసం పోరాడుదాం

**- స్త్రీ, పురుష సమానత్వం కోసం పోరాడిన తల్లి సావిత్రిభాయి పూలె**

**- డిఎస్ఎ రాష్ట్ర కన్వీనర్ కె. శ్రావణ్**

హైదరాబాద్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): స్త్రీ, పురుష సమానత్వం కోసం, సమాజంలో ఉన్న అంతరాలను ఛేదిస్తూ, మహిళా అభ్యున్నతి కోసం, పురుషులతో సమానంగా మహిళలు కూడా చదువుకోవాలనే దృక్పథంతో ముందుకు సాగుతూ తన జీవితాంతం అణగారిన వర్గాల అభ్యున్నతికై పాటుపడిన గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే. ఆ తల్లి 194వ జయంతి సందర్భంగా శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆ సంఘ రాష్ట్ర కన్వీనర్ శ్రవణ్ మాట్లాడుతూ సమాజంలో ఉన్న అంతరాలు తొలగిపోవాలని మహిళలు కూడా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని, కుల వివక్షత, అంటరానితనం, అస్పృశ్యత, సతీసహగమనంలాంటి దుశ్చర్యలతో ఆనాడు ఆధిపత్య కులాలు అణగారిన వర్గాలపై చేస్తున్న అధిపత్య ధోరణికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరుస్తూ, మహిళలు తమ హక్కుల కోసం పోరాడాలని, మహిళలు కూడా పురుషులతో సమానంగా చదువుకోవాలని తలచిన మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని ఆమే చేసిన త్యాగాలని గుర్తుంచుకోవడం మనందరి బాధ్యత అని



వారు ఏ ఆశయ సాధన కోసం అయితే పనిచేశారో బాధ్యత గల విద్యార్థులుగా మనం కూడ ఈ యొక్క సమాజం కోసం, సమాజంలో ఉన్న అవంతరాలను తొలగించేందుకు కృషి చేయాలని వారన్నారు. అలాగే ఈ యొక్క కార్యక్రమాన్ని ఉద్దేశించి డీఎస్ఎ రాష్ట్ర కో-కన్వీనర్ గణేష్ మాట్లాడుతూ మహిళా అంటే వంటింటికే పరిమితమై, పురుష ఆధిపత్యం కింద బానిసలుగా ఉన్న మహిళల అభ్యున్నతి కోసం పాఠశాలలు ప్రారంభించి మహిళ అభ్యున్నతికి పాటు పడిన మహోన్నతమైన వ్యక్తి సావిత్రిభాయి పూలె అని, ఆమె ఆశయాల సాధన కోసం, ఆమె త్యాగలను, ఆమె పోరాట స్ఫూర్తిని పునికి పుచ్చుకొని విద్యార్థులు తమ హక్కుల కోసం పోరాడాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు శివ, అశోక్, రాజేష్, అనూష, మౌనిక, సంధ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో సావిత్రిబాయి ఫూలే జయంతి

హనుమకొండ జిల్లా, జనవరి 03 (తీన్మార్ న్యూస్): దేశంలోనే మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హనుమకొండ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరావగా, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, తదితరులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన మహిళా ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుడా ఛైర్మన్ ఇనగల వెంకట్రాంరెడ్డి, గ్రేటర్ వరంగల్



మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, డీఈవో వాసంతి, మహిళా ఉపాధ్యాయులు, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

నేరేడుచర్ల, జనవరి 03 (తీన్మార్ న్యూస్): సావిత్రిబాయి పూలే జయంతిని చెల్లెపల్లి లోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బాక్వార్డ్ క్లాస్సేస్ వెల్ఫేర్ రెసిడే న్సియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ నందు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం లో ప్రిన్సిపల్ కే .అనుకరణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సామాజిక నాయకులు రాపోలు నవీన్ కుమార్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి దారి చూపిన మార్గదర్శి కుల వివక్ష, పితృస్వామిక పీడలపై పోరాడిన వీరనారి విద్యతోనే వనితకు విముక్తి సాధ్యమన్న సామాజిక సంస్కర్త ఆధునిక భారత మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, మహిళలకు విద్యను అందించడం కోసం నిరంతరం పాటుపడి, సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి నిరంతరం కృషి చేసిన సామాజిక సంఘ సంస్కర్త సావిత్రిబాయి ఫులే అని కొనియాడారు కే .శ్రీ నాగలక్ష్మి అనే స్టూడెంట్ సావిత్రి బాయ్ పులే వేశాధారణ విసిన స్టూడెంట్ కి సన్మానం చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో స్టాఫ్ సుజాత, స్వాతి, ఇందిర, మేరీ



విజయకుమారి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు జీలకర్ర రామస్వామి, రణపంగు శ్రవణ్, ఇంజమూరి రాజేష్, నాగార్జున చిత్రం విశ్వనాదం అంజి గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# సావిత్రిబాయి పూలే ఆశయాలు బహుజన్ సమాజ్ పార్టీ తోనే సాధ్యం

## బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇన్చార్జి మైస సతీష్

ములుగు, జనవరి 03 (తీన్మార్ న్యూస్): బహుజన్ సమాజ్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాడపాక రాజశేఖర్ వర్మ ఆధ్వర్యంలో మహాత్మా సావిత్రిబాయి పూలే 193వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్చార్జి మైస సతీష్ హాజరై మాట్లాడుతూ ఈ దేశంలో చదువులేని బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ అగ్రకుల పేదలకు చదువు నిరాకరించిన రోజుల్లో మనువాద సమాజానికి వ్యతిరేకంగా పోరాటం చేసి జ్యోతిరావు పూలే ఆశయాలను భుజాన వేసుకుని బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ సమాజానికి చదువు నేర్పుకుంటూ సమాజంలోని రుగ్మతలను రూపుమాపడం కోసం అహర్నిశలు పోరాటం చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే స్వాతంత్ర్యానికి పూర్వం ఉన్న పీశ్వా బ్రాహ్మణులు నిరంతరం బహుజన జాతులకు చదువులు నేర్పుతావా అని చెప్పి రాళ్లతో కొట్టిన లెక్కచేయకుండా సమాజానికి చదువు నేర్పిన ఘనత మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ఈ దేశంలో సావిత్రిబాయి పూలే ఆశయాలను ముందుకు తీసుకెళు తున్న బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి



మాత్రమే నిజమైన వారసురాలు అని అన్నారు సావిత్రిబాయి పూలే కలలుగన్న సమతా సమాజం బహుజన రాజ్యంలోనే అది బీఎస్పీ తోనే సాధ్యమని సావిత్రిబాయి పూలే ఆశయ సాధన కోసం బహుజన్ సమాజ్ పార్టీ వెంట బహుజన సమాజమంతా తరలి రావాలని అన్నారు. సావిత్రి బాయి పూలే కృషి వల్లనే ఇవ్వాల్టి రోజున అందరూ విద్యావంతులుగా తయారవుతున్నారనీ అన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు కోగిలా సుధాకర్,అసెంబ్లీ అధ్యక్షులు కొగిలా అజయ్ కుమార్, సంగీ శివ, రాజ్ కుమార్, తిరుపతి, సమ్మయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుల తల్లి సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగిద్దాం

## బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సాగర్

దేవరకద్ర, జనవరి 03 (తీన్మార్ న్యూస్): భారతదేశపు చదువుల తల్లి సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగిద్దామని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సాగర్ అన్నారు. బీసీ సమాజ్ మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో సావిత్రిబాయి పూలే పటానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన బహుజన సమాజానికి అక్షరాలు నేర్పిన తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని ఇవాళ లక్షలాదిమంది అమ్మాయిలు చదువు ద్వారా తమ జీవితాలను మార్చుకున్నారు అంటే అందుకు కారణం సావిత్రిబాయి పూలే నాడు ప్రారంభించిన విద్య ఉద్యమమే అని ఆయన అన్నారు. విద్యా వ్యాప్తికి కేవలం నాలుగేళ్లలో 20 పాఠశాల నెలకొల్పి,అప్పటిదాకా విద్యకు దూరం చేయబడిన దళితులు శూద్రులు,మహిళలకు విద్యను నేర్పడం కోసం వారి జీవితకాలంలో 52 పాఠశాలలను నెలకొల్పడం జరిగిందన్నారు. 1873లో పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహించి సమాజాన్ని ఆలోచింపజేసేటట్లు చేసి భర్త చనిపోతే భార్యను సైతం కాష్టంలో వేసి తగలబెట్టిన సమాజంలో వాటిని అడ్డుకొని వితంతువులకు ఆశ్రయం కల్పించడంజరిగిందన్నారు. కరువు సంభవించిన కాలంలో దాదాపు 2వేల మంది అనాధ పిల్లలకు భోజనాలు ఏర్పాటు చేసి ఆదుకుంటూ, పూణే పరిసర ప్రాంతాల్లో సంభవించిన ప్లేగు వ్యాధి బాధితులకు సేవ చేస్తూ ఆ ప్లేగు బారిన పడి ఆమె ప్రాణాలు విడిచారన్నారు. అడుగడుగునా ఎన్నో అవంతరాలను అడ్డంకులను ఎదుర్కొని సావిత్రిబాయి కొనసాగించిన చారిత్రాత్మకమైన ఆమె జీవితాన్ని ఇవాల్టి పాలకులు గుర్తించాలని శ్రీనివాస్ సాగర్



అన్నారు. వివిధ కుల సంఘ పెద్దలు మాట్లాడుతూ చదువు, సేవ, సాహిత్యమని మూడు రత్నాలను అధిరోహించిన సావిత్రిబాయి ని భారతరత్నతో సత్కరించాలని అదేవిధంగా ఆమె మార్గంలోని చదువు, మూఢనమ్మకాల నిర్మూలన, సామాజిక సేవను రోజువారి జీవితంలో భాగం చేసుకున్నప్పుడే మనమందరం ఆ మహనీయు రాలికిచ్చిన ఘనమైన నివాళులని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, జిల్లా సగర సంగం మాజీ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్, రజక సంఘం జాతీయ నాయకుడు నడిమింటి శ్రీనివాసులు, జాంద్ర సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, కాశికపడి యువజన సంఘం నాయకులు కోమల్, బీసీ జర్నలిస్ట్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అశన్న ముదిరాజ్, తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు రవిముదిరాజ్, రజక సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నాగన్న, జిల్లా అధ్యక్షుడు రాజు, బీసీ సమాజ్ భూత్పూర్ మండల కన్వీనర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# మామిడిలో ఎగుమతి కొరకు యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం

వరంగల్ జిల్లా, జనవరి 03 (తీన్మార్ న్యూస్): జిల్లాలోని వర్ధన్నపేట మండలం దమ్మన్న పేట రైతు వేదికలో శుక్రవారం హార్టి కల్చర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మామిడి రైతుల అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని మామిడి ఎగుమతులకు అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను అదేశించడమైనది. మామిడి ఎగుమతులకు కావలసిన అవగాహన అంశాలను పవర్ ప్రెజెంటేషన్ ద్వారా డా. జ్యోతి సైంటిస్, మామిడి రైతులకు మరియు వ్యాపారస్తులకు, వివరించడమైనది. ఈరోజు దమ్మన్నపేట, వర్ధన్నపేట మండలం రైతు వేదికలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో సమగ్ర ఉద్యాన పంటల అభివృద్ధి మిషన్ లో భాగంగా మామిడిలో నాణ్యత ప్రమాణాలు పెంచడానికి మరియు పూత మరియు పిందె సమయంలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల పైన రైతు సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ముందస్తు చర్యలు నిమిత్తం ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడమైనదని, కూరగాయలు పండుచుటకు చిన్న సన్నకారు రైతులకు డ్రిప్ ఇరిగేషన్ కు దరఖాస్తు చేసినట్లు అయితే యూనిట్ సరఫరా చేయుటకు చిన్న సన్నకారు రైతుకు 90%,పెద్ద రైతులకు 80 శాతం ఎస్సీ ఎస్టీ లకు 100 శాతం జీఎస్టీ లేకుండా సబ్సిడీ వర్తిస్తుందని ఉత్సాహవంతులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. మిరప పత్తి మామిడి పంటలలో రైతులకు మార్కెటింగ్ సమయంలో జరిగే అటువంటి అసౌకర్యాల గురించి మరియు ఎగుమతి చేసుకోవడానికి పాటించవలసిన నాణ్యత ప్రమాణాలు ఏ విధంగా పెంపొందించాలో ఇలాంటి అవగాహన సదస్సులు వివిధ పంటల్లో ఉద్యాన శాఖ వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖల, సమన్వయంతో రైతులకు అవగాహన కల్పించాలని, వరంగల్ ప్రాంతా రైతులకు మార్కెట్లో మంచి ధర వచ్చే విధంగా మెలుకులు నేర్పించాలని మామిడి మార్కెటింగ్ సంబంధించినటువంటి అంశాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని రైతులకు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం రాయపర్తి పర్వతగిరి వర్ధన్నపేట మండలాల్లో గల మామిడి సాగు చేసే సుమారు రెండు వందల మంది రైతులతో మామిడి పంటపైన ఎన్ఐపిహెచ్ఎం శాస్త్రవేత్త డాక్టర్ జ్యోతి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చీడపీడల గురించి అదేవిధంగా రైతులకు వచ్చినటువంటి




సందేహాలను నివృత్తి చేయడం జరిగింది. ఆపేడా హైదరాబాద్ నుండి వచ్చిన శాస్త్రవేత్త డి స్వామి వరంగల్ ప్రాంతం నుంచి నుండి మామిడి విదేశాలకు ఎగుమతి చేయడానికి ఆచరించవలసినటువంటి పద్ధతులను, దానికి సంబంధించి నటువంటి పథకాల గురించి రైతులకు వివరించడం జరిగింది. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రసిడెంట్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ మామిడి కోత సమయంలో కూడా ఇలాంటి మీటింగ్ పెట్టి రైతులు పడుతున్నటువంటి ఇబ్బందులపై చర్చించి మా వంతుగా ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో తెలియపరచడం మంచి ఆలోచన అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి వరంగల్ రాకేష్ మాట్లాడుతూ ప్రస్తుతం పూత పింద దశలో అవలంబించవలసిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి విజయకుమార్ ఉద్యాన అధికారులు తిరుపతి తరుణ్ మరియు మామిడి సాంబయ్య అమర్ మరి గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారులు డాక్టర్ రాకేష్ తిరుపతి తరుణ్ నాయక్, అగ్రికల్చర్ ఏ. ఇ విజయ్ కుమార్ ,డిపి స్వామి సీనియర్ బిజినెస్ ఆర్గనైజర్, ఏఎంసీ సెక్రెటరీ నిర్మల, ఫ్రూట్ సెక్షన్ సెక్రటరీ వెల్డి సాంబయ్య, మరియు రైతుకు వ్యాపార వేత్తలు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి ఫూలే జయంతి వేడుకలు

**- సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం**

ఆత్మకూర్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూర్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం రోజు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు వేడుకల్లో భాగంగా సావిత్రిబాయి చిత్రపటానికి ఆత్మకూరు మున్సిపల్ చైర్పర్సన్ గాయత్రి రవికుమార్ యాదవ్ కమీషనర్ శశిధర్ పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఇట్టి సమావేశంలో మున్సిపల్ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని పలు అభివృద్ధి పనులకు సంబంధించి చర్చించారు. మున్సిపల్ అభివృద్ధియే లక్ష్యమని మున్సిపల్ చైర్పర్సన్ గాయత్రి రవికుమార్ యాదవ్ తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ విజయభాస్కర్ రెడ్డి కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# బిజెపి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

సూర్యాపేట, జనవరి 03 (తీన్మార్ న్యూస్): భారతీయ జనతా పార్టీ సూర్యాపేట జిల్లా కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సంఘసంస్కర్త, రచయిత్రి, భారతదేశం మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయులు, అందరూ చదవాలి మంచిగా ఎదగాలి అంటూ మహిళలకు అక్షరాలు నేర్పించిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. అనంతరం బిజెపి జిల్లా కార్యాలయంలో జిల్లా కోర్ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో బూత్ కమిటీ ఎన్నికల ప్రక్రియ, మండల కమిటీ ఎన్నికల ప్రక్రియ గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, జిల్లా ఎన్నికల ఇంచార్జ్ నాగురామ్ నామోజీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడియం రామచంద్రయ్య, చల్లా శ్రీలత రెడ్డి, అసెంబ్లీ



కన్వీనర్లు కర్నాటి కిషన్ కనగాల నారాయణ, అంబల్ల నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు సలిగంటి వీరేంద్ర, మల్లెపాక సాయిబాబా, అక్కిరాజు యశ్వంత్, జిల్లా ఉపాధ్యక్షులు చల్లమల్ల నరసింహ, సీనియర్ నాయకులు రంగరాజు రుక్మారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉర్సు ఉత్సవాలు పకడ్బందిగా నిర్వహించాలి

**– దర్గా ఉత్సవాల ఏర్పాట్లపై ముందస్తు సమీక్ష సమావేశం**

**– అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి**

**– జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట, జనవరి 03 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా పాలకీడు మండలంలోని జాన్పాడు గ్రామంలో గల హజరత్ జాన్ పాడ్ సైదులు బాబా దర్గా వద్ద ప్రతి జనవరి 3 వారం 24,25, లలో జరిగే ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఏర్పాట్లపై సంబంధిత శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా కలెక్టర్ జాన్పాడుదర్గా ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు అనంతరం దర్గా ముజబర్ సయ్యద్ జానీ జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా దర్గా లోనికి ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాన్పాడు గ్రామాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఉత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని, ఉత్సవం విజయవంతంగా జరిగే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఉరుసు జరిగేటప్పుడు పారిశుధ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సిబ్బందిని అధికంగా ఏర్పాటు చేసి జాతర జరిగే టైములో 24 గంటలు విధులలో ఉండేటట్లుగా సిబ్బందిని ఏర్పాటు చేయాలని, ప్రతిరోజు హాజరు తీసుకోవాలని కలెక్టర్ ఎంపీడీవో పద్మకు తెలిపారు. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి దర్గా వద్ద ఏర్పాట్లకు 65 లక్షలు మంజూరు చేశారని అలాగే సిసి రోడ్ల నిర్మాణం జాతరకు వచ్చు అన్ని రోడ్లను మరమ్మత్తులు చేయాలని పంచాయతీరాజ్ డివిజనల్ ఇంజనీర్ ప్రదీప్ కు కలెక్టర్ ఆదేశించారు. దర్గా వద్ద పర్మనెంట్ టాయిలెట్స్ నిర్మాణం కొరకు లొకేషన్స్ ను పరిశీలించాలన్నారు. తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లు ప్రజలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. వీలైన చోట్ల మొబైల్ టాయిలెట్స్ మహిళల కొరకు ప్రత్యేక ఏర్పాటు చేయాలన్నారు. త్రాగునీటి కొరకు మిషన్ భగీరథ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, ట్యాంకుల ద్వారా నీటిని ఏర్పాటు చేయాలని, తాత్కాలిక బోర్ వెల్స్ ఏర్పాటు చేసుకోవాలని, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద సోప్ పీట్స్ తప్పక ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్యం కొరకు సిబ్బంది, ట్రాక్టర్లు, ట్యాంకులు, బ్లీచింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. నాలుగు పార్కింగ్ ప్లేస్ లలో నాలుగు టీములను ఏర్పాటు చేసి వారిపై ఒక సూపర్వైజర్ ని పెట్టాలని ఆర్డిఓ శ్రీనివాస్ కి సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు వ్యాపారాలకు, గృహ అవసరాలకు, ఉత్సవానికి సపరేటుగా డిస్ట్రిబ్యూషన్ లైన్స్ ఏర్పాటు చేయాలని, అలాగే తగినన్ని ట్రాన్స్ఫార్మర్లు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. పార్కింగ్ ప్లేస్ లలో హైమాస్ లైట్ ఏర్పాటు చేయాలని, అలాగే రెండు ఆర్టీసీ బస్టాండ్ లో కూడా లైటింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ పరంగా జాగ్రత్తలన్నీ విద్యుత్ విద్యుత్ శాఖ అధికారులు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. జాతర ప్రాంతాన్ని మొత్తం మ్యాప్ సిద్ధం చేయాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు టెంపుల్ చుట్టూ ఉన్న రోడ్లు అలాగే గ్రామంలో ఉన్న రోడ్లు మనమత్తులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పెట్టాలని దర్గా వద్ద మెయిన్ క్యాంప్ ఉండాలని రెండు అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని అలాగే హుజూర్నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మిర్యాలగూడెం ఆరోగ్య కేంద్రాల వద్ద సిబ్బంది జాతర జరుగు సమయంలో 24 గంటలు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు దర్గా వద్ద ఫుడ్ కమిటీలు ఏర్పాటు చేసి ఆహార పదార్థాలను నిరంతరం పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు .వీఐపీ లకు ప్రత్యేక ప్రోటోకాల్ అధికారి ఏర్పాటు చేయాలని ఆర్డీవో శ్రీనివాస్ కు కలెక్టర్ తెలిపారు. పోలీస్ సిబ్బంది రెండు కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేయాలని అలాగే పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజలకు తమ పూర్తి సహకారాన్ని అందించాలని తెలిపారు . ఉత్సవానికి సంబంధించిన అన్ని శాఖల అధికారులు తమ పూర్తి అంచనాలను నివేదికలను రేపు సాయంత్రం కల్లా అందించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్,డిఎస్పీ, డిఎల్పిఓ యాదయ్య,డివిజనల్ పంచాయతీరాజ్ అధికారి ప్రదీప్, ఎలక్ట్రికల్ ఏడి శక్రు నాయక్, దర్గా ముజావర్ సయ్యద్ జానీ,కాంగ్రెస్ పార్టీ నాయకులు సుబ్బారావు, గోపాల్ నాయక్, మోతిలాల్ నాయక్, దక్కన్, పెన్నా సిమెంట్స్ మేనేజర్లు,ఎమ్మార్వో,, ఎంపిడివో సిఐ,ఎస్ఐ,వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఆశాజ్యోతి



నేరేడుచర్ల, జనవరి 03 (తీన్మార్ న్యూస్): మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా భారత తొలి ఉపాధ్యాయురాలు, గొప్ప సంఘసంస్కర్త, రచయిత్రి శ్రీమతి సావిత్రిబాయి పూలే 194వ జయంతి మహోత్సవాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల నందు ఘనంగా నిర్వహించారు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహనీయురాలు సావిత్రిబాయి పూలే గొప్ప సంఘసంస్కర్తగా భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా దేశానికి, మహిళలు, బాలికల విద్యకు అందించిన ఎనలేని సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల మహిళా ఉపాధ్యాయులు అన్నపూర్ణ మాధవి నాగమణి అఫ్రూన్ భానుమతిలను ప్రధానోపాధ్యాయులు బట్టు మధు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు ఘనంగా సత్కరించారు

# ప్రజల మన్ననలు పొందాలి

**– సమస్యలతో వచ్చే ప్రజలను ఆదుకోవాలి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలలోకి తీసుకెళ్లాలి**

**– గ్రూప్ 4 ద్వారా రెవిన్యూ శాఖలో 47 మందికి ఉద్యోగాలు**

**– జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**





సూర్యాపేట, జనవరి 03 (తీన్మార్ న్యూస్): సమస్య లతో వచ్చే ప్రజలకి సహాయం చేస్తూ వారిని ఆదుకోవాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి ఇటీవల టిజిపిఎస్సి ద్వారా ఉద్యోగం పొందిన 47 మందికి కౌన్సిలింగ్ నిర్వహించి రెవిన్యూ శాఖ లో పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో కష్టపడి ఉద్యోగం సాధించునందుకు అభినందనలు తెలిపారు. రెవిన్యూ కార్యాలయాలకి వచ్చే ప్రజలతో మంచిగా ప్రవర్తించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చివరి వ్యక్తికి చేరే విధంగా కృషి చేయాలని, కార్యాలయానికి సమయ పాలన పాటించాలని, ఎలాంటి అత్యాశకి పోకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి,సూపరిటీడెంట్ పద్మారావు, సిబ్బంది, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రిబాయీ పూలె జయంతి

**– మహిళా ఉపాధ్యాయులకు సన్మానం**

**– పాఠశాల బాలికలకు బాల కవి సమ్మేళనం**

శంకరపట్నం: శంకరపట్నం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ లో భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, మహాత్మ జ్యోతిబాపూలే సహచరి, కవయిత్రి సంఘసంస్కరణ వాది, శ్రీమతి సావిత్రిబాయి పూలె 194వ జయంతి వేడుకలు శుక్రవారం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సరిత ఆదేశాల మేరకు ఇన్చార్జి ప్రిన్సిపల్ కె ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మకమైన నిర్ణయాలలో ప్రజా పాలన భవన్ కి మహాత్మ జ్యోతిబాపూలే పేరు పెట్టడం అలాగే జనవరి 3 ను సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం గా నిర్వహించడం చాలా మంచి నిర్ణయమన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేసే మహిళా ఉపాధ్యాయులు నాగమని, ఫర్విన్ ,ఆర్ రజిత ,ఎస్ రజిత, కనక లక్ష్మీ, వనజ, రాధ, సంధ్య, స్వప్న ,రజని ,జ్యోతి, అనిత, నిర్మల, మొత్తం 13 మంది మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. అలాగే పాఠశాలలోని బాలికలకు సావిత్రిబాయి జీవితం– చరిత్ర అనే శీర్షికతో బాల కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మహిళా ఉపాధ్యాయుల చేతులమీదుగా బహుమతుల అందించారు. అలాగే విద్యార్థినీ విద్యార్థులు ఆదర్శమూర్తి, మాతృ మూర్తి సావిత్రిబాయి పాటలకు నృత్యాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలోపాఠశాల సాంస్కృతిక విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ మహేందర్,ఉపాధ్యాయులు రాజు, కంప్యూటర్ ఆపరేటర్ సమ్మయ్య పిఈటి మోహన్లతోపాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# టిజెఎస్ జిల్లా ప్లీనరీ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం



భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 03 (తీన్మార్ న్యూస్): శుక్రవారం తెలంగాణ జన సమితి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్లీనరీ సమావేశం ఈరోజు పాల్వంచలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో జిల్లాలో పార్టీ బలోపేతానికి సంబంధించి పలు కీలక అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం గారు మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయిలో బలపర్చేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ప్రజల సమస్యలపై ఆందోళనలు నిర్వహించి వారి ఆకాంక్షలకు తోడ్పడాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా నేతలు, కార్యకర్తలు, మరియు పౌరసమాజ ప్రతినిధులు పాల్గొన్నారు. ప్లీనరీ చివర్లో నూతన కార్యవర్గాన్ని ప్రకటించి, ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.

# కలెక్టరేట్లో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



మహబూబాబాద్ జిల్లా, జనవరి 03 (తీన్మార్ న్యూస్): ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) లోనీ ప్రధాన సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కే.వీరబ్రహ్మాచారి, ఇతర జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలోనూ తన భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో సావిత్రిబాయి చదువు నేర్చుకుని ఉపాధ్యాయురాలు అయ్యారని గుర్తు చేశారు. విద్యను అభ్యసిస్తేనే స్త్రీ విముక్తి సాధ్యమవుతుందని గ్రహించిన సావిత్రిబాయి, సాటి మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో బాలికల పాఠశాలను ప్రారంభించి మహిళా చైతన్యానికి బాటలు వేశారని, తద్వారా ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా కీర్తి గడించారని అన్నారు. అస్పృశ్యత, అంటరానితనం, కులవివక్షత వంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించేందుకు పూలే దంపతులు చేసిన పోరాటం, చూపిన తెగువ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆనాటి ఆధిపత్య వర్గాల సామాజిక కట్టుబాట్ల కారణంగా ఎన్ని అవాంతరాలు ఎదురైనా, వాటిని లెక్కచేయ కుండా మహిళల విద్యాభివృద్ధికి అకుంఠిత దీక్షతో కృషి చేసిన ధీశాలి సావిత్రిబాయి పూలే అని ప్రశంసించారు. ఆ మహనీయురాలి స్ఫూర్తితో మహిళల అభ్యున్నతి కోసం కృషి చేయాలని, అప్పుడే ఆమె ఆశయ సాధనకు కృషి చేసినట్లు అవుతుందని అన్నారు. సావిత్రిబాయి సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఇకనుండి ఆమె జయంతిని పురస్కరించుకుని ప్రతియేటా జనవరి 3వ తేదీన మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి, సిపిఓ సుబ్బారావు, జడ్పీ సీఈఓ పురుషోత్తం, డిహెచ్ఓ మరియన్న, డిపిఓ హరిప్రసాద్, కలెక్టరేట్ ఏ.ఓ పవన్ కుమార్, పర్యవేక్షకులు మదన్ గోపాల్, భద్రకాళి, తదితరులు పాల్గొన్నారు.

# భూభారతితో రెవెన్యూ సేవలు మెరుగు

**– చట్టం అమలు బాధ్యత అధికారులదే**

**– రెవెన్యూ సంఘాలతో సీఎం రేవంత్ టీజీటీఏ, టీజీఆర్ఎస్ఏ డైరీల ఆవిష్కరణ**

**– తహసీల్దార్ల బదిలీలు చేపట్టాలని సీఎంకు లచ్చిరెడ్డి విజ్ఞప్తి**



హైదరాబాద్: కొత్త ఆర్వోఆర్ చట్టంగా భూభారతి త్వరలోనే అమల్లోకి రానుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. భూభారతి రాకతో రాష్ట్రంలోని రైతులకు మెరుగైన రెవెన్యూ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కొత్త చట్టంతోనే భూ సమస్యలకు సైతం పరిష్కారం లభిస్తుందని చెప్పారు. బుధవారం తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ), తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(టీజీఆర్ఎస్ఏ) నూతన సంవత్సర డైరీల ఆవిష్కరణ సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మెన్ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.లచ్చిరెడ్డితో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త ఆర్వోఆర్ చట్టం, దానిలోని ప్రధాన అంశాల గురించి చర్చించారు. ధరణితో రాష్ట్రంలో భూ సమస్యలు పెరిగాయని సీఎం అభిప్రాయపడ్డారు. రైతులు, ప్రజలకు రెవెన్యూ సేవలను వేగంగా, సులభంగా అందించే లక్ష్యంతోనే భూభారతిని తీసుకొచ్చినట్టు వివరించారు. జిల్లా స్థాయిలోనే అన్ని రకాల భూ సమస్యలకు పరిష్కారం లభించేలా కొత్త చట్టం ఉందన్నారు. ఇదే కాకుండా రెవెన్యూ అధికారులకు సైతం వివిధ స్థాయిల్లో అధికారాలను కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. కొత్త రెవెన్యూ చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా సమర్ధవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత కూడా రెవెన్యూ అధికారులు, ఉద్యోగులదేనని వ్యాఖ్యానించారు. భూభారతిలో కల్పించిన అధికారాల వికేంద్రీకరణతో క్షేత్రస్థాయిలోనే రైతులకు కావాల్సిన రెవెన్యూ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇదే కాకుండా ప్రతి రెవెన్యూ గ్రామంలోనూ ఒక రెవెన్యూ అధికారి ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నట్టు చెప్పారు.

# తపస్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



ఆత్మకూర్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూతన క్యాలెండర్ను వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఆత్మకూర్ మండల విద్యాశాఖ అధికారి కొండాపురం బాలరాజు అమరచింత మండల విద్యాశాఖ అధికారి భాస్కర్ సింగ్ చేతుల మీదుగా తపస్ నూతన క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఇట్టి కార్యక్రమంలో తపస్ కమిటీ జిల్లా బాధ్యులు విజయభాస్కర్ రెడ్డి కృష్ణ రామన్ గౌడ్ వెంకటయ్య వెంకటేశ్వర్రెడ్డి భాస్కర్ మల్లేష్ యాదవ్ బాలు నాగరాజ్ ఆత్మకూరు మండలం కార్యదర్శులు ఉమశంకర్ నారాయణ అమరచింత మండల కార్యదర్శిల కోట్ల కృష్ణయ్య ఒగ్గు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహిళ ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు



ఆత్మకూర్, జనవరి 03 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వా జూనియర్ కళాశాలలో మహిళ ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ భాగ్యం వర్ధన్ రెడ్డి మరియు అధ్యాపక బృందం పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాలలోని మహిళా అధ్యాపకులకు శాలువాతో సన్మానించారు. అనంతరం సావిత్రిబాయి పూలే సేవలను కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యవవర్ధన్ రెడ్డి కొనియాడారు. ఇట్టి కార్యక్రమం లో కళాశాల అధ్యాపకులు టీజే విశ్వేశ్వర్ రాఘవేంద్రరావు కురుమూర్తి జమ్మన్న సునీల్ రాఘవేంద్ర బాలకృష్ణ గౌడ్ రామన్ గౌడ్ బుచ్చయ్య సతీష్ అధ్యాపకులు విద్యార్థులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో పాఠాలు బోధించిన

## కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: తిమ్మాపూర్ మండలంలోని నల్లగొండ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆరవ తరగతి విద్యార్థులకు గణిత శాస్త్రాన్ని బోధించారు. పిల్లలతో మమేకమై వారిని పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. సిలబస్ గురించిన ప్రశ్నలు వేస్తూ జవాబులు రాబట్టారు. 8వ తరగతి విద్యార్థులను సైన్స్ గురించిన ప్రశ్నలను అడిగారు. విద్యార్థులు సరైన జవాబులు ఇవ్వడంతో ఉపాధ్యాయుల బోధన పట్ల సంతృప్తి చెందారు. నల్లగొండ ప్రభుత్వ పాఠశాలలో బోధన బాగుందని ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని, ప్రభుత్వ పాఠశాలకు పిల్లలను పంపేందుకు తల్లిదండ్రులను ఒప్పించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని, కిచెన్ గార్డెన్ పట్ల ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంఈఓ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారావు పాల్గొన్నారు.



# ఏడాది నుంచి ఇదిగో... అదిగో,,,

## రేషన్ కార్డులు ఎప్పుడు

అదిలాబాద్: రేషన్ కార్డుల జారీపై తెలంగాణలో ఉత్కంఠ కొనసాగుతోంది. ఇప్పటికే కొత్త కార్డుల జారీ పలుమార్లు వాయిదా పడటంతో ఆశావహులకు ఎదురు చూపులు తప్పడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో రేషన్ కార్డుల జారీపై ప్రకటనలు జారీ చేస్తూ వాయిదా వేస్తూ కేవలం రెండుసార్లు మాత్రమే స్వల్ప సంఖ్యలో రేషన్ కార్డులు అందించి చేతులు దులుపుకున్నారనే విమర్శలు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 2016 నుంచి దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం 2019లో కొన్ని కార్డులు అందించి ఆ వెబ్‌సైట్ మూసివేసింది.ఇదే తీరున కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని సంక్రాంతి పండుగ సైతం రేషన్ కార్డులు అందజేయకుంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో తీవ్ర ప్రభావం చూపుతోందనే వాదనలు ఉన్నాయి.రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వులు ప్రకారం జిల్లాలోని సివిల్ సప్లై శాఖ కొత్త రేషన్ కార్డులు జారీకి సన్నాహాలు చేస్తున్నారు. వారం రోజుల నుండి అధికారులు అర్హుల జాబితాలను పరిశీలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విధించిన కొత్త నిబంధనల ప్రకారం గా అర్హుల ఎంపికను చేపడుతోంది. కొత్త నిబంధనలు దేశంలోని పలు రాష్ట్రాల్లో గుజరాత్, ఆంధ్రప్రదేశ్, కేరళ,, మహారాష్ట్ర, పంజాబ్ లలో ఏ విధంగా లబ్ధిదారులను ఎంపిక చేశారో అదే రీతిన మన తెలంగాణ ప్రభుత్వం సైతం నిబంధనల మార్పులు చేసినట్టు తెలుస్తుంది.ప్రజా సంక్షేమలో భాగంగా ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుంది, ప్రభుత్వం నుంచి పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి కనీస అర్హత రేషన్ కార్డు ఆధార్ కార్డు కలిగి ఉండాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో కొత్త రేషన్ కార్డులు లేకపోవడంతో అర్హులైన వారికి కూడా అనర్హతకు గురవుతున్నారు.రేషన్ కార్డులో గల్లంతయిన పేర్లు, కొత్తగా జన్మించిన పేర్లు, పెళ్లి చేసుకున్న వారి పేర్లు నమోదు చేసుకోవడానికి అవకాశం లేకపోవడంతో ప్రజలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. అయితే ఇటీవల ప్రజా పాలనలో భాగంగా సంక్షేమ పథకాలు లబ్ధి కోసం..రేషన్ కార్డుల దరఖాస్తుల కూడా స్వీకరించారు. ఇప్పటివరకు రేషన్ కార్డులు జారీ చేయలేదు.ఈ నేపథ్యంలో ఇటీవల శాసనసభల్లో సమావేశాలు సంక్రాంతి కానుకగా కొత్త రేషన్ కార్డులు జారీ చేయనట్లు మంత్రి ఉత్తరం కుమార్ రెడ్డి ప్రకటించారు. దీంతో పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి, కానీ కార్డుల జారిపై మారదర్శకాలు నిబంధనలపై స్పష్టత ఇవ్వలేదని పాత దరఖాస్తులు పరిగణలోకి తీసుకుంటారా? ప్రజాపాలనలో తీసుకున్న సమీకృత దరఖాస్తుల ఆధారంగా కార్డులు జారి చేస్తారా అనే సందేహం నెలకొంది.మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా అధికారులకు కసరత్తు చేస్తున్నారు, సర్పంచుల పదవీకాలం ముగిసి 11నెలలు కాకావస్తోంది, మరో నెల రోజులైతే పుర సంఘాల ఎన్నికలు రానున్నాయి. పంచాయతీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు అధికారులు సన్నాహ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల జాబితాను కూడా విడుదల చేశారు. నోడల్ అధికారులు సైతం నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు ప్రకటిస్తే తెల్ల రేషన్ కార్డులు సన్న బియ్యం పంపిణీకి బ్రేకులు పడ్డ ట్లేననే సందేహాలు ప్రజల్లో ఉన్నాయి.

# ఉత్తర తెలంగాణలో.. ఎన్నికల సందడి

కరీంనగర్: త్వరలో జరగనున్న ఉత్తర తెలంగాణలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల తుది జాబితాను అధికారులు విడుదల చేశారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఓటర్లు 3,41,313 మంది, థర్డ్ జెండర్లు ముగ్గురు ఉండగా ఉపాధ్యాయ ఓటర్లు 25,921 మంది ఉన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ కసరత్తు చేస్తున్న క్రమంలో ఇప్పటికే రెండు సార్లు ఓటర్ నమోదుకు అవకాశమిచ్చింది. తుది జాబితాను ప్రకటించి ఇదే జాబితాతో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఓటర్ల సంఖ్య క్రమంలో పట్టభద్రులకు సంబంధించి 499 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఓటర్లకు 274 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.ఓటరు నమోదులో కరీంనగర్ టాప్ లో నిలిచింది. పట్టభద్రులు, టీచర్ ఓటరు నమోదులో రెండింటిలో కరీనీనగర్ జిల్లా వారే ఎక్కువ మంది ఉన్నారు. పట్టభధ్రుల, టీచర్ల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి 15 జిల్లాలుండగా పట్టభద్రుల ఓటరు నమోదులో కరీంనగర్ జిల్లాలో 69,657 మంది అత్యధిక సంఖ్యలో ఓటరుగా నమోదు కాగా అత్యల్పంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేవలం 2,420 మంది మాత్రమే ఓటరుగా నమోదు చేసుకోవడం విశేషం.ఉపాధ్యాయ ఓటరు నమోదులో 4,020 మంది ఓటర్లుగా నమోదు చేసుకోగా అతి తక్కువగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి 81మంది మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. నిజామాబాద్, సిద్ధిపేట జిల్లాలు కరీంనగర్ తరువాత స్థానాల్లో నిలువగా ఇతర జిల్లాలో నమోదు అంతంతమాత్రమే. సాధారణ ఓటరు జాబితాలో మహిళల ఆధిక్యం ఉండగా ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పురుష సంఖ్యకు సగానికి ఉండటం గమనార్హం.ఈ ఏడాది సెప్టెంబరు 30న ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమై నవంబరు 6వ తేదీ వరకు కొనసాగింది. దీంతో పట్టభద్రులు 3,58,579 మంది ఓటును నమోదు చేసుకోగా, ఉపాధ్యాయులు 27,994 మంది ఓటును పొందడానికి ఉత్సాహాన్ని చూపించారు. తిరిగి నవంబర్ 23వ తేదీ నుంచి డిసెంబరు 9వ తేదీ వరకు కొత్తగా నమోదుతో పాటు అభ్యంతరాలకు సమయం ఇవ్వడంతో కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి పలువురు ముందుకొచ్చారుపక్షం రోజుల వ్యవధిలో పట్టభద్రులవి 28,111 ధరఖాస్తులు కొత్తగా చేరగా.. ఉపాధ్యాయుల పరంగా అదనంగా 5,054 మంది ఆసక్తిని చూపించారు. దీంతో మొత్తంగా పట్టభద్రుల ఓటర్ల దరఖాస్తుల సంఖ్య 3,86,690కి చేరింది. ఉపాధ్యాయ ఓటర్ల దరఖాస్తుల సంఖ్య 33,048కి పెరిగింది. మలి విడతలో ఆన్ లైన్, ఆఫ్ లైన్ లో వచ్చిన దరఖాస్తులను డిసెంబర్ 10 నుంచి పరిశీలించగా చాలా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. పక్కాగా ఉన్న వాటిని మాత్రమే ఆమోదం తెలిపి తుది జాబితాను అధికారులు విడుదల చేశారు. ఇంకా ఎవరైనా నమోదు చేసుకునేవారుంటే షెడ్యూల్ వెలువడ్డాక నామినేషన్ ప్రక్రియ ప్రారంభం అయ్యేవరకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించనున్నది.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తప్పుల తడకగా ఉందని బిఆర్ఎస్ నేత ఎమ్మెల్సీ గా పోటీ చేసేందుకు సిద్ధమైన సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ ఆరోపించారు. ఒక్కరి పేరు రెండు మూడు చోట్ల నమోదు అయిందని, అత్యధికంగా 8 చోట్ల ఓటర్ జాబితాలో ఉందన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలను మీడియాకు విడుదల చేశారు. దీనిపై ఎలక్షన్ కమిషన్ కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఆధార్ ఆధారంగా పట్టభద్రుల ఓటర్ల జాబితా తయారు చేయాలని డిమాండ్ చేశారు.

# టాప్ గేర్ లో నార్త్ హైదరాబాద్

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న తాజా నిర్ణయంతో హైదరాబాద్ లోని ఉత్తర ప్రాంతంలో ఉన్న భూముల ధరలు మరింత పెరగనున్నాయి. ఇప్పటికే ఆ ప్రాంతంలో ధరలు ఆకాశాన్నంటాయి. తాజాగా తీసుకున్న నిర్ణయంతో ధరలు మరింత పెరిగే అవకాశముందని తెలిసింది. మేడ్చల్, కొంపల్లి, శామీర్ పేట్ వరకూ భూముల ధరలకు ఇక రెక్కలు వస్తాయి. అందుకు ప్రధాన కారణం మెట్రో రైలు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడమే. ఇప్పటికే ఈ ప్రాంతం విస్తరించింది. దాదాపు మేడ్చల్ వరకూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేశారు. అనేక చోట్ల ఈ ప్రాంతంలో వేసిన వెంచర్లు అలాగే ఉన్నాయి. అమ్ముడు పోవడం లేదు. సిటీకి రావాలంటే కష్టంగా మారడం వల్లనే ఈ ప్రాంతంలో కొనుగోలు చేయడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదు. . కొత్త సంవత్సరం తొలి రోజు హైదరాబాద్ వాసులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. మెట్రో రైలును మేడ్చల్ వరకూ పొడిగించాలని నిర్ణయించారు.ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకూ కారిడార్ ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టును తయారు చేయాలని ఆదేశించారు. డీపీఆర్ ను వెంటనే కేంద్ర ప్రభుత్వానికి పంపి ఆమోదం పొందేందుకు ప్రయత్నిస్తామని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకూ, షామీర్ పేట్ నుంచి జేబీఎస్ వరకూ వెంటనే రెండు కారిడార్లకు సంబంధించిన డీపీఆర్ లను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించడంతో నార్త్ హైదరాబాద్ లో ఉంటున్న వారికి నిజంగా ఇది అమలయ్యేతే కొత్త సంవత్సరం వేళ శుభవార్తే అవుతుంది.. ప్లాట్లు, ఫ్లాట్లు కొనుగోలు చేయాలంటే సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు ముందుకు రావాలి. అయితే ఇక్కడ నివాసం ఉండి మాదాపూర్, గచ్చిబౌలికి రావాలంటే గంటల తరబడి ప్రయాణం తప్పదు. రోడ్డు మార్గంలో రావాలంటే ట్రాఫిక్ చిక్కుల్లో పడక తప్పదు. అంత దూరంలో ఉండి గంటల తరబడి ఇళ్లకు చేరుకోవడం సాధ్యం కానివని. కార్యాలయాలన్నీ ఇటు వైపు ఉండగా నగర శివార్లలో ఉత్తరం వైపు ఉన్న ఆ ప్రాంతం వైపు ఉన్న ఫ్లాట్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి కనపర్చడం లేదు. అయినా ఇప్పటికే కొంపల్లి నుంచి హైవే ఉన్నందున కొంత మేర అక్కడ అభివృద్ధి ప్రారంభమయింది. చాలా డెవలెప్ అయింది. అనేక నిర్మాణాలు వెలిశాయి. కార్పొరేట్ సంస్థలు కూడా అక్కడ ఏర్పాటయ్యాయి. ఇక మెట్రో రైలు కూడా ఏర్పాటయితే ఇక అక్కడ భూముల ధరలు కొనలేని పరిస్థితి ఉంటుంది.... ఎప్పటి నుంచో మేడ్చల్ వైపు కనీసం కొంపల్లి వరకూ అయినా మెట్రో రైలును విస్తరించాలని ఆ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. గత ప్రభుత్వం ఇటువైపు చూపిన శ్రద్ధ అటు వైపు పెట్టలేదన్న ఆగ్రహంతో ఉన్నారు. అయినా గత ఎన్నికల్లో మేడ్చల్ ఇతర ప్రాంతాల్లో తిరిగి బీఆర్ఎస్ పార్టీనే గెలిపించారు. అయితే రేవంత్ రెడ్డి కొత్త ఏడాది తీసుకున్న నిర్ణయంతో తమ ట్రాఫిక్ కష్టాలు తీరతాయని భావిస్తున్నారు. ప్రధానంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా ఖుషీ కబురు అందినట్లే ఫీలవుతున్నారు. మెట్రో రైలు ఏర్పాటయితే నగరం నడిబొడ్డుకు రాకపోకలు సాగించేందుకు సులువవుతుందని ఇక అమ్మకాలు ఊపందుకున్నాయన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

**శామిర్ పేటకు మెట్రో**

మిర్ పేట్, మేడ్చల్ వరకు మెట్రో మార్గాలను పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. జేబీఎస్ నుండి శామిర్ పెట్ వరకు గల 22 కిలోమీటర్లు, ప్యారడైజ్ నుండి మేడ్చల్ వరకు 23 కిలోమీటర్ల మెట్రో మార్గానికి సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మెట్రో రైల్ ఫేజ్ 2 బి భాగంగా డీపీఆర్ తయారు చేయాలని సీఎం మెట్రో అధికారులకు ఆదేశాలిచ్చారు. సీఎం తీసుకున్న నిర్ణయం పై మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.ఇప్పటికే హైదరాబాద్ నగరం లో రెండవ దశ మెట్రో రైల్ మార్గాలను నిర్మించేందుకు మెట్రో సిద్ధమైంది.ఈ దశలో మేడ్చల్ వరకు కూడా మెట్రో మార్గాన్ని పెంచాలని సీఎంనిర్ణయం తీసుకోవడంపట్ల నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కారు గేరు మారుస్తారా...

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత గత ఏడాది ఎక్కడా కనిపించలేదు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కేసీఆర్ ప్రచారానికి వచ్చారు. అన్ని జిల్లాల్లో పర్యటించారు. అయితే పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా బీఆర్ఎస్ సాధించలేకపోయింది. దీంతో కేసీఆర్ నాటి నుంచి ఎర్రవెల్లి లోని ఫాం హౌస్ కే పరిమితమయ్యారు. ఎవరైనా ఆయనను కలవాలనుకున్నాఅక్కడకు వెళ్లాల్సిందే. తప్పఆయన బయటకు రావడం లేదు. ఇటీవల మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణించినా ఫాం హౌస్ నుంచి ఒక సంతాప ప్రకటన అయితే పంపారు తప్ప ఆయన మాత్రం బయటకు రాలేదు. నిజానికి మన్మోహన్‌సింగ్ తో ఉన్న అనుబంధంతో ఆయన ఢిల్లీకి వెళ్లి నివాళులర్పించాల్సిన తరుణంలో ఫాం హౌస్ కే పరిమితమయ్యారు. మరొకవైపు అసెంబ్లీ సమావేశాలకు కూడా దూరంగా ఉన్నారు. బడ్జెట్ సమావేశాలకు రాలేదు. సరే..ఇటీవల మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలిపేందుకు ప్రత్యేకంగా సమావేశమైన సభకు కూడా కేసీఆర్ హాజరు కాకపోవడం చర్చనీయాంశ మైంది. తనకు మన్మోహన్ సింగ్ తో ఉన్న అనుబంధం ఆయన తన నోటి నుంచి చెప్పి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం అందరిలో ఉన్నా దూరంగానే ఉన్నారు. ఇక తెలంగాణలో అనేక కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.ఫార్ములా ఈ కారు రేసు కేసులో కేటీఆర్ ఏ1 నిందితుడిగా ఉన్నారు. ఆయనపై ఇటు ఏసీబీ కేసు నమోదు చేసి విచారణ జరుపుతుంది. మరోవైపు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా నోటీసులు జారీ చేశారు. ఈడీ అధికారులు అయితే ఈ నెల 7వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. ఏసీబీ అధికారులు కూడా ఈ కేసులో విచారించే అవకాశాలున్నాయి. అంతే కాదు అరెస్ట్ చేస్తారన్న ప్రచారం కూడా జరుగుతుంది. ఈ నేపథ్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా అంతా తానే అయి ఇన్ని రోజులు కార్యకర్తలకు భరోసాగా ఉన్న కేటీఆర్ కు నోటీసులు వచ్చిన సమయంలోనైనా కేసీఆర్ బయటకు రాకపోవడం గులాబీ పార్టీలో చర్చనీయాంశమైంది. అసలు కేసీఆర్ కు జనంలో తిరిగే ఆలోచన ఉందా? లేదా? అన్నది కూడా పార్టీలో తెలియకుండా ఉంది. కేసీఆర్ బయటకు వచ్చి జనంలో తిరిగితే కార్యకర్తలకు కూడా ధైర్యం కలుగుతుందని తెలిసినా ఫాం హౌస్ కే పరిమితమవ్వడమేంటన్న ప్రశ్న అందరిలోనూ కలుగుతుంది.ఎర్రవెల్లి ఫాం హౌస్ లో కేసీఆర్ కేవలం వ్యవసాయ పనులు చూసుకుంటూ గడిపేస్తున్నారు. కొత్త ఏడాది శుభాకాంక్షలు తెలిపేందుకు కూడా అక్కడకు నేతలకు వెళ్లాల్సిన పరిస్థితి. తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడంలేదని, రైతు లకు ఇంత వరకూ భరోసా అందలేదని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తు న్నారు.ఈ సమయంలో కేసీఆర్ వచ్చి కనీసం మీడియా సమావేశం నిర్వహించి ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఇటు ప్రజల్లోనూ , అటు కార్యకర్తల్లోనూ ధైర్యం కలుగుతుందని, కానీ కనీసం ఆ పని కూడా చేయకపోతే ఎలా? అన్న ప్రశ్నలు గులాబీ పార్టీ నుంచి వినపడుతు న్నాయి.అనేక మంది పార్టీ నేతలపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నా కేసీఆర్ బయటకు రాకపోవడంపై పార్టీలోనే ఒకింత నిరాశ నిస్పృహలు బయలుదేరాయి.

# పెరుగుతున్న భార్య బాధితులు

న్యూఢిల్లీ: దేశంలో భార్య బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. బెంగళూరులో టెకీ అతుల్ సుభాశ్ ఆత్మహత్య ఘటన మరిచిపోక ముందే ఢిల్లీలో మరో భార్య బాధితుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఢిల్లీలో ప్రముఖ కేఫ్ యజమాని ఆత్మహత్య చేసుకోవడం సంచలనం రేపింది. ఉడ్‌బాక్స్ కేఫ్ వ్యవస్థాపకుడు పునీత్ ఖురానా తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కళ్యాణ్ విహార్ ప్రాంతం మోడల్ టౌన్‌లో నివాసం ఉంటోన్న పునీత్.. తన గదిలో ఉరికి వేలాడుతూ కనిపించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పునీత్ ఖురానా, ఆయన భార్య మానికా జగదీశ్ పహ్వా మధ్య విడాకుల కేసు నడుస్తుండగా.. వ్యాపారం విషయంలో ఇద్దరి మధ్య గొడవలు నడుస్తున్నాయిఉడ్‌బాక్స్ కేఫ్ యాజమాన్యం విషయంపై పునీత్, మానికా మధ్య గొడవలు జరుగుతున్నట్టు పోలీసులు తెలిపారు. భార్య వేధింపులతోనే తమ కుమారుడు బలవన్మరణానికి పాల్పడినట్టు పునీత్ కుటుంబసభ్యులు ఆరోపించారు. పునీత్, మానికాకు 2016లో పెళ్లి జరిగింది. ఖురానా, మానికా మధ్య జరిగిన ఫోన్ సంభాషణకు సంబంధించిన 16 నిమిషాల ఆడియో క్లిప్ ఒకటి బయటకు వచ్చింది. ఈ ఆడియోలో ఇరువురి మధ్య బిజినెస్ ప్రాపర్టీ గురించి జరిగిన వాగ్వాదం రికార్డయ్యింది. 'మనం విడాకులు తీసుకున్నాం.. కానీ, నేను ఇంకా వ్యాపార భాగస్వామినే.. నాకు రావాల్సిన మొత్తం చెల్లించాల్సిందే' అని పునీత్‌ను మానికమె డిమాండ్ చేయడం స్పష్టంగా వినిపిస్తోంది.పునీత్ ఆత్మహత్య ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు.. ఆయన ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పునీత్ భార్యను విచారణకు హాజరుకావాలని నోటీసు పంపారు. తమ కుమారుడిని మానికా చాలా వేధించినట్టు పునీత్ పేరంట్స్ ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం కావాలని వాళ్లు వేడుకుంటున్నారు.ఏడాది వరకు ఇద్దరు బాగానే ఉన్నారు. తరువాత గొడవలు ప్రారంభమయ్యాయి. తన బిడ్డను చాలా టార్చర్ చేసింది.. ఎంతో మానసిక వేదన అనుభవించాడు.. డబ్బుల గురించి , బిజినెస్ గురించి గొడవలు జరిగాయి.. అయితే తన కొడుకు ఎప్పుడు తన బాధను తమకు చెప్పలేదని తల్లిదండ్రులు చెప్పారు. తాము టెన్షన్ పడుతామని చెప్పేవాడు కాదు.. లోలోన చాలా బాధపడ్డాడని చెప్పారు. తన భార్య పెట్టే టార్చర్ భరించలేకే తన కొడుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన కొడుకు మరణించాడు.. తమకు న్యాయం కావాలంటూ పునీత్ తల్లిదండ్రులు చెబుతున్నారు. డిసెంబరు మొదటి వారంలో బిహార్‌కు చెందిన అతుల్ సుభాష్.. బెంగళూరులో ఆత్మహత్యకు పాల్పడ్డారు. భార్య నికిత సింఘానియా, ఆమె కుటుంబ సభ్యుల వేధింపుల కారణంగానే తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు అతుల్ 24 పేజీల సూసైడ్ లెటర్ రాసి.. దానిని హైకోర్టు, తాను పనిచేసే ఆఫీసు, తల్లిదండ్రులకు మెయిల్ చేశాడు. న్యాయవ్యవస్థపై కూడా అతుల్ ఆరోపణలు చేయడం.. విడాకుల కేసు విచారించిన జడ్జి తనను రూ.5 లక్షలు డిమాండ్ చేసినట్టు ఆరోపించాడు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలన రేపింది. ఈ కేసులో అతుల్ భార్య నికిత, ఆమె తల్లి, సోదరుడ్ని బెంగళూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన మరవక ముందే ఢిల్లీలో పునీత్ ఆత్మహత్యకు పాల్పడడం తీవ్ర కలకలం రేపుతోంది.

# ఎమ్మెల్యేల ప్రోగ్రెస్ రిపోర్ట్...

హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి న్యూ ఇయర్ సందర్భంగా తనను కలిసేందుకు వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రభుత్వ, పార్టీపరమైన అంశాలపై కీలక సూచనలు జారీ చేశారు. ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇకపై తాను ఎక్కువ సమయం పార్టీ నాయకులకు కేటాయించనున్నట్లు, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.న్యూ ఇయర్ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన నివాసం వద్దకు తరలివచ్చారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి నివాసం సందడిగా మారింది. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం ప్రత్యేకంగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యేల పనితీరుపై సర్వే రిపోర్ట్ లు తన వద్ద ఉన్నాయని, అలాగే తన రిపోర్టు కూడా తాను తెప్పించుకున్నట్లు సీఎం అన్నారు.ఎవరి ప్రోగ్రెస్ రిపోర్టు వారికి అప్పగించడం జరుగుతుందని, ప్రజలకు ప్రతి ఒక్కరు అందుబాటులో ఉండాలని సీఎం సూచించారు. ఏడాది పాలనలో తెలిసి తప్పు చేయలేదని, తెలియకుండా జరిగిన తప్పులపై చర్యలు తీసుకున్నామంటూ సీఎం అన్నారు. ఏడాది పాలనలో ఎన్నికల కోడ్ రావడంతో పూర్తిస్థాయి పాలన ఆరు నెలలు సాగినట్లుగా భావించాలని, కేవలం ఆరు నెలల్లో ప్రజా మద్దతును తమ ప్రభుత్వం సాధించిందన్నారు. ఏడాది పాలన అనుభవాలు, వచ్చే నాలుగేళ్లకు ఉపయోగపడతాయని, ప్రజా ప్రభుత్వంగా మన ప్రభుత్వం గుర్తింపు పొందేలా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సీఎం సూచించారు.ఈ దశలో అంగన్వాడీ, డీలర్ల నియామకంలో పార్టీ నాయకులకు అవకాశం ఇవ్వాలని ఓ మంత్రి కోరగా, ఆ విషయాన్ని సీఎం తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఆన్లైన్లో దరఖాస్తులు తీసుకొని, పారదర్శకంగా నియామకాలు చేపట్టకపోతే తప్పుడు సంకేతాలు వెళ్తాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లు సమాచారం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల నియామకాలను చేపట్టేందుకు సాహసించలేదని, తమ ప్రభుత్వం పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను సాగించిందన్నారు.ఇకపై పార్టీ నాయకులకు ఎక్కువ సమయం కేటాయించేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని, స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి చాలా కీలకమంటూ ప్రజా ప్రతినిధులకు సీఎం సూచించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రతి విషయం గురించి తన వద్ద సమాచారం ఉందని, పార్టీ బలోపేతానికి కూడా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారుతెలంగాణలో మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టినట్లు, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని కూడా సీఎం అన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో ప్రస్తుతం సానుకూల వాతావరణం ఉందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలు గుర్తించి ప్రభుత్వ ఇబ్బందులను అర్థం చేసుకున్నారన్నారు. ప్రతి ఒక్కరు తమ పనితీరును మరింతగా మెరుగుపరుచుకుని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి మద్దతు కూడబెట్టుకోవాలని సీఎం తెలిపారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు

### కరీంనగర్ పోలీస్ కమిషనర్ – అభిషేక్ మొహంతి

కరీంనగర్ : కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల దృష్ట్యా నియమ నిబంధనలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత ఏసీపీ ల నుంచి అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులను నిర్వహించకూడదని తెలిపారు. అనుమతులు లేకుండా ఎటువంటి సభలు సమావేశాలు, ర్యాలీలు నిర్వహించ కూడదని సంబంధిత అధికారుల నుండి అనుమతులు తప్పనిసరి అని తెలిపారు అనుమతుల కోసం దరఖాస్తు చేయడం ద్వారా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అట్టి కార్యక్రమానికి తగిన విధంగా పోలీసు శాఖ భద్రతాపరమైన చర్యలు చేపడుతుంది అన్నారు.ఈ చట్టం అమలులో వుండగా ఇతరులను గాయపరిచే విధంగా ఉండే వస్తువులు, మారణాయుధాలను ధరించి సంచరించకూడదు. రోడ్లు, ప్రజలకు ఉపయోగపడే ఇతర స్థలాల్లో జనాన్ని సమీకరించకూడదు.జన సంచారం మరియు అనుమతి పత్రాలలో పేర్కొన్నబడిన ప్రాంతాలలో మ్యూజిక్ లు, పాటలు, ప్రసంగాలు, రణగొణ ధ్వనులు చేయవద్దని కోరారు. ఈ ఉత్తర్వులు ఈనెల 31 వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ తెలిపారు.

# పెన్షనర్లకు ప్రయోజనాలు సత్వరం అందిస్తాం

### –జిల్లా ట్రెజరీ అధికారి సీ.హెచ్.సోఫియా

జగిత్యాల: పెన్షనర్లకు ప్రయోజనాలను సత్వరం అందిస్తున్నామని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతామని జిల్లా ట్రెజరీ అధికారి సీ.హెచ్.సోఫియా అన్నారు. తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు గురువారం జిల్లా ట్రెజరీ అధికారికి పుష్పగుచ్ఛం అందించి 2025 శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం పెన్షనర్స్ అసోసియేషన్ 2025 క్యాలెండర్లను, డైరీలను ట్రెజరీ అధికారి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ట్రెజరీ అధికారి సోఫియా మాట్లాడుతూ పెన్షనర్స్ సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న హరి ఆశోక్ కుమార్ ను,వారి సంఘ ప్రతినిధులను అభినందించారు.టీ పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ మా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి 2025 శుభాకాంక్షలు తెలిపామని, సమస్యలను విన్నవించగా సానుకూలంగా పరిష్కరిస్తా మని హామీ ఇచ్చారన్నారు.అన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందించాలని,మార్చి 2024 నుంచి రిటైర్మెంట్ అయిన వారికి జీ.పి.ఎఫ్.గ్రాట్యుటీ,కమ్యూటేషన్,లీవ్ సాలరీ,తదితర ప్రయోజనాలు వెంటనే విడుదల చేయాలని,పెన్షనర్స్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, తదితర డిమాండ్లను సత్వరం పరిష్కరించాలని ప్రభుత్వంను కోరారు.జిల్లా ట్రెజరీ అధికారి సోఫియా ఆధ్వర్యంలో ఏ.టి.ఓ.మధు కుమార్, ఎస్.టి.ఓ. గణేష్, అసిస్టెంట్ రవి లు, సమస్త ట్రెజరీ కార్యాలయం సిబ్బంది పెన్షనర్స్ కు, ఉద్యోగులకు ,ఉపాధ్యాయులకు అందిస్తున్న సేవలను హరి ఆశోక్ కుమార్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏ.టీవో. మదుకుమార్, ఎస్టీఓ గణేష్,రవి జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్,కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, సహాయ అధ్యక్షుడు పి.హన్మంత రెడ్డి,ఉపాధ్యక్షులు వెల్మల ప్రకాష్ రావు,ఎం.డి.యాకూబ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పూసాల అశోక్ రావు,నాయకులు ఎం.డి.ఇక్బాల్, సయ్యద్ యూసుఫ్, జగిత్యాల యూనిట్ అధ్యక్షుడు బి.రాజేశ్వర్, ధర్మపురి యూనిట్ అధ్యక్షుడు కండ్లే గంగాధర్, మల్యాల అధ్యక్షుడు ఎం.డి.యాకోబ్, కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం,యాకూబ్ హుస్సేన్, ఎం.డి.జాఫర్, కరుణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పంత్ భారీ సిక్స్... నిచ్చెనెక్కి బంతిని తీసిన గ్రౌండ్ స్టాఫ్...

**సిడ్నీ టెస్టులో లాంగ్ ఆన్ మీదుగా భారీ సిక్సర్ బాదిన పంత్**

**కొత్త బౌలర్ వెబ్‌స్టర్ బౌలింగ్‌లో ఈ భారీ షాట్**

**సైట్ స్క్రీన్‌పై చిక్కుకున్న సిక్స్ వెళ్లిన బంతి**

**నిచ్చెన వేసుకుని మరీ ఆ బంతిని తీసిన మైదానం సిబ్బంది**




బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ) సిరీస్‌లో భాగంగా సిడ్నీ వేదికగా జరుగుతున్న ఆఖరిదైన ఐదో టెస్టులో భారత బ్యాటర్లు మరోసారి విఫలం కావడంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్ లో 185 పరుగులకే ఆలౌట్ అయింది. అయితే, భారత జట్టు ఈ మాత్రం స్కోరైనా చేసిందంటే దానికి కారణం రిషభ్ పంత్. ఇవాళ్టి మ్యాచ్‌లో 40 పరుగులతో మనోడు టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

ఆసీస్ బౌలర్ల నుంచి దూసుకొచ్చిన పదునైన బంతులు తనను పలుమార్లు గాయపరిచాయి. అనేక బంతులు అతని శరీరానికి బలంగా తగిలాయి. కొన్ని దెబ్బలకు అతను ఫిజియో నుంచి చికిత్స కూడా తీసుకున్నాడు. పేసర్ మిచెల్ స్టార్క్ విసిరిన బంతి పంత్ మోచేతిపైన తాకడంతో వెంటనే వాపు వచ్చేసింది. ఆ నొప్పితో పంత్ విలవిలలాడాడు. బంతి తగిలిన చోట పెద్ద మచ్చలా ఏర్పడింది. వెంటనే సిబ్బంది వచ్చి చికిత్స అందించారు. ఆ తర్వాత పంత్ తిరిగి ఆటను కొనసాగించాడు. దాటిగానే బ్యాటింగ్ చేశాడు. ఈ క్రమంలోనే కొత్త బౌలర్ వెబ్‌స్టర్ బౌలింగ్‌లో ఓ భారీ సిక్సర్ బాదాడు. లాంగ్ ఆన్ మీదుగా పంత్ ఆడిన ఈ భారీ షాట్ మ్యాచ్‌కే హైలైట్ అని చెప్పాలి. ఇక సిక్స్ కొట్టిన బంతి సైట్ స్క్రీన్‌పై చిక్కుకుంది. దాంతో గ్రౌండ్ స్టాఫ్ నిచ్చెన వేసుకుని మరీ ఆ బంతిని తీశారు. దీని తాలూకు వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఇది చూసిన భారత అభిమానులు పంత్‌తో పెట్టుకుంటే మాములుగా ఉండదు మరి అని కామెంట్ చేస్తున్నారు.

# రోహిత్ తప్పుకోవడం భావోద్వేగ నిర్ణయం: రిషభ్ పంత్

ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఐదో టెస్ట్ నుంచి టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తప్పుకోవడం భావోద్వేగపూరితమైన నిర్ణయమని వికెట్ కీపర్ రిషభ్ పంత్ తెలిపాడు.

ఇదో నిస్వార్థమైన పని అని, రోహిత్ నిఖార్సైన సారథని ప్రశంసించాడు. శుక్రవారం సిడ్నీ వేదికగా ప్రారంభమైన ఐదో టెస్ట్‌కు రోహిత్ శర్మ దూరంగా ఉండగా.. జస్‌ప్రీత్ బుమ్రా జట్టును నడిపిస్తున్నాడు. జట్టు ప్రయోజనాల కోసమే రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌కు దూరంగా ఉన్నాడని టాస్ సందర్భంగా బుమ్రా తెలిపాడు.

ఈ మ్యాచ్‌లో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 185 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్(98 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 40), రవీంద్ర జడేజా(95 బంతుల్లో 3 ఫోర్లతో 26) టాప్ స్కోరర్లుగా నిలిచారు. చివర్లో బుమ్రా(17 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 22) విలువైన పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో స్కాట్బోలాండ్(4/31) నాలుగు వికెట్లతో చెలరేగగా.. మిచెల్ స్టార్క్(3/49) మూడు వికెట్లు పడగొట్టాడు. ప్యాట్ కమిన్స్(2/37) రెండు వికెట్లు దక్కాయి. నాథన్ లయన్ ఓ వికెట్ తీసాడు.

అనంతరం ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ ప్రారంభించగా.. ఉస్మాన్ ఖవాజా(2)ను బుమ్రా పెవిలియన్ చేర్చాడు. దాంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ 3 ఓవర్లలో వికెట్ నష్టానికి 9 పరుగులు చేసింది.



తొలి రోజు ఆట అనంతరం మీడియాతో మాట్లాడిన రిషభ్ పంత్‌ను రోహిత్ గైర్హాజరీ గురించి ప్రశ్నించగా తనదైన శైలిలో బదులిచ్చాడు. 'నాకు తెలిసి ఇది భావోద్వేగపూరితమైన నిర్ణయం. ఎందుకంటే సుదీర్ఘ కాలంగా రోహిత్ సారథిగా కొనసాగుతున్నాడు. మేమంతా అతన్ని టీమ్ నాయకుడిగానే చూస్తున్నాం. కానీ కొన్ని నిర్ణయాల్లోనే మనం భాగం కాలేం. ఇది మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయం. ఆ చర్చలో నేను భాగం అవ్వలేదు. కాబట్టి ఇంతకు మించి నేను ఏం చెప్పలేను.'అని రిషభ్ పంత్ పేర్కొన్నాడు.

# టెస్టుల్లోనే కాదు... వన్డే ఫార్మాట్ కెప్టెన్సీ నుంచి రోహిత్ శర్మ ఔట్?

**– ఛాంపియన్స్ ట్రోఫీ–2025లో కెప్టెన్సీని హార్దిక్ పాండ్యాకు అప్పగించే అవకాశాలు**

**– టీమ్ మేనేజ్‌మెంట్ ఆలోచిస్తున్నట్టు వెలువడుతున్న కథనాలు**

**– రోహిత్‌పై కెప్టెన్సీ భారం పడుతుందని భావిస్తున్నట్టుగా సమాచారం**




అనూహ్య రీతిలో సిడ్నీ టెస్టులో భారత తుది జట్టులో చోటు కోల్పోయిన కెప్టెన్ రోహిత్ శర్మ క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారిపోయాడు. బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో మొత్తం 5 ఇన్నింగ్స్‌ల్లో బ్యాటింగ్ చేసిన హిట్‌మ్యాన్ కేవలం 31 పరుగులే చేశాడు. దీంతో, కీలకమైన చివరి టెస్ట్ మ్యాచ్‌లో డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది.

అయితే, టెస్ట్ ఫార్మాట్‌లోనే కాదు ఫిబ్రవరిలో వన్డే ఫార్మాట్‌లో జరగనున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ–2025లో కూడా రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తప్పించే అవకాశాలు ఉన్నాయంటూ కొత్త కథనం తెరపైకి వచ్చింది. ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా కెప్టెన్‌గా స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యాను ఎంపిక చేయవచ్చని 'మై ఖేల్' పేర్కొంది. ఈ మేరకు టీమ్ మేనేజ్‌మెంట్ ఆలోచిస్తున్నట్టు తెలిసిందని వెల్లడించింది. "అధిక ఒత్తిడి పరిస్థితుల్లోనూ పాండ్యా రాణిస్తాడు. ఆల్‌రౌండర్‌గా అపార అనుభవం. కెప్టెన్‌గా రాణించిన అనుభవం దృష్ట్యా పాండ్యా బెస్ట్ ఛాయిస్‌గా కనిపిస్తున్నాడు" అని విశ్లేషించింది.

రోహిత్ శర్మ ఇప్పటికే టీ20 ఫార్మాట్ నుంచి వైదొలిగాడు. అతి త్వరలోనే టెస్ట్ ఫార్మాట్ నుంచి కూడా రిటైర్‌మెంట్ ఖాయమనే ఊహాగానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వన్డే కెప్టెన్సీ భారాన్ని అతడిపై మోపకూడదని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్టు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. మొత్తంగా ఐదవ టెస్టుకు దూరమవ్వడంతో రోహిత్ శర్మ భవిష్యత్‌పై పలు ఊహాగానాలకు దారితీస్తోంది. కాగా, పాకిస్థాన్, దుబాయ్ వేదికగా ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ మొదలుకానుంది.

# బుమ్రాతో వాగ్వాదానికి దిగిన ఆసీస్ ఆటగాడు సామ్ కోన్ స్టాస్ ..!

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీ జరుగుతున్న చివరి టెస్ట్ లో భారత్ 185 పరుగులకే ఆలౌట్ అయింది. భారత ఆటగాళ్లో రిషబ్ పంత్ 40 పరుగులు చేయగా..

రవీంద్ర జడేజా 26, గిల్ 20 పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్లలో బోలాండ్ 4 వికెట్లు తీయగా.. స్టార్క్ 3, కమ్మిన్స్ 2, లయన్ ఒక వికెట్ పడగొట్టాడు. మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియాను ఆదిలోనే దెబ్బ కొట్టాడు. ఈ క్రమంలోనే ఆసీస్ ఓపెనర్ సామ్ కోన్ స్టాస్ భారత కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రాతో వాగ్వాదానికి దిగాడు.

కోన్ స్టాస్ భారత్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు కూడా వాగుతూనే ఉన్నాడు. ఇరిటేషన్ తెప్పించే ప్రయత్నం చేశాడు. ఆసీస్ బ్యాటింగ్ మొదలు పెట్టినప్పుడు అతను దూకుడుగా ఆడాడు. జస్ప్రీత్ బుమ్రా వేసిన మొదటి బంతినే కోన్ స్టాస్ బౌండరీ తరలించాడు. ఈ క్రమంలోనే

బుమ్రా మూడో ఓవర్ బౌలింగ్ వేశాడు. నాలుగు బాల్స్ పూర్తి అయ్యాయి. ఐదో బంతి వేసేందుకు సిద్ధం కాగా. . స్ట్రైకింగ్ చేస్తున్న ఖవాజా పక్కకు జరిగాడు.

దీంతో బుమ్రా ఏమైంది అంటూ.. వెనక్కు వెళ్లి బౌలింగ్ చేసే ప్రయత్నం చేశాడు. కోన్ స్టాన్ ఏదో అన్నాడు. దీంతో బుమ్రా వెనక్కు దిరిగి అతని వద్దకు వెళ్లే ప్రయత్నం చేశాడు. కోన్ స్టాస్ కూడా మాట్లాడడంతో మాటమాట పెరిగింది. ఈ క్రమంలోనే ఎంపైర్ జోక్యం చేసుకున్నాడు.



దీంతో గొడవ సర్దుకుంది. ఆ తర్వాత ఓవర్ చివరి బంతికి బుమ్రా ఖవాజాను ఔట్ చేశాడు. అతను స్లిప్ లో క్యాచ్ ఇచ్చాడు. కేఎల్ రాహుల్ క్యాచ్ పట్టాడు. దీంతో భారత ఆటగాళ్లు, స్పెషల్లీ బుమ్రా కోన్ స్టాస్ వైపు చూస్తూ సంబరాలు చేసుకున్నారు.

కాగా ఆస్ట్రేలియా ప్రస్తుతం ఒక వికెట్ కోల్పోయి 9 పరుగులు చేసింది. శనివారం భారత బౌలర్లు ఆసీస్ ను 150 పరుగుల లోపు ఆలౌట్ చేస్తే మ్యాచ్ పై పట్టుబిగించే అవకాశం ఉంది. లేకుంటే ఈ మ్యాచ్ కూడా చేయిజారిపోయే అవకాశం ఉందంటున్నారు. ఈ మ్యాచ్ లో రోహిత్ శర్మ ఆడలేదు. దీంతో రోహిత్ శర్మ రిటైర్మెంట్ తీసుకుంటారా అనే సందేహాలు వస్తున్నాయి.

# రోహిత్ ఔట్.. కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా!

భారత క్రికెట్‌లో భారీ మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కల్పిస్తున్నాయి. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ అంతర్జాతీయ టెస్ట్‌లకు వీడ్కోలు పలుకుతాడనే ప్రచారం జోరుగా సాగుతోంది.


పేలవ ఫామ్‌తో సతమతమవుతున్న ఈ ఇద్దరు స్టార్ ఆటగాళ్లు గౌరవంగా తప్పుకోవాలనే అభిమానులు సూచిస్తున్నారు.

ఆస్ట్రేలియాతో సిడ్నీ వేదికగా శుక్రవారం ప్రారంభమైన ఐదో టెస్ట్‌కు కెప్టెన్ రోహిత్ శర్మ దూరంగా ఉన్నాడు. జట్టు ప్రయోజనాల కోసం స్వచ్ఛందంగా తప్పుకున్నాడని, తాత్కలిక సారథి జస్‌ప్రీత్ బుమ్రా తెలిపాడు. అయితే వన్డే క్రికెట్‌కు కూడా రోహిత్ శర్మ దూరమవుతాడనే ప్రచారం తెరపైకి వచ్చింది. వన్డే సారథ్య బాధ్యతల నుంచి రోహిత్ శర్మను తప్పించి హార్దిక్ పాండ్యాను నూతన సారథిగా నియమించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయి.

వన్డే కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా..

ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు హార్దిక్ పాండ్యాను కెప్టెన్‌గా ఎంపిక చేసి.. ఆ తర్వాత పూర్తి స్థాయి సారథిగా కొనసాగిస్తారనే వాదన వినిపిస్తోంది. అదే జరిగితే ఫిబ్రవరిలో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా రోహిత్ శర్మకు బదులు హార్దిక్ పాండ్యా సారథ్యంలో ఆడాల్సి ఉంటుంది. అప్పుడు రోహిత్ జట్టులో ఆటగాడిగా కొనసాగుతాడా? లేదా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతాడా?అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికారు. ఒకవేళ బీసీసీఐ వన్డే కెప్టెన్సీ మార్పు నిర్ణయాన్ని ప్రకటిస్తే రోహిత్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికే ఛాన్స్ ఉంది.



కోహ్లీ సైతం..

మరోవైపు కోహ్లీ కేవలం బ్యాటర్‌గానే జట్టులో కొనసాగుతున్నాడు. ఆసీస్ పర్యటనలో అతను దారుణంగా విఫలమయ్యాడు. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 అనంతరం అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాలనే ఆలోచనలో విరాట్ కోహ్లీ ఉన్నట్లు సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. ఫామ్‌లో లేకపోతే ఎవరినైనా ఊపేక్షించేది లేదని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఇప్పటికే స్పష్టం చేశాడు.

ఫార్మాట్‌కో కెప్టెన్..

టీమిండియా వన్డే కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యాను బీసీసీఐ నియమిస్తే.. టీమిండియాకు ఫార్మాట్‌కో కెప్టెన్ ఉంటాడు. టీ20ల్లో టీమిండియాను సూర్యకుమార్ యాదవ్ నడిపిస్తున్నాడు. అతని సారథ్యంలోని టీమిండియా అసాధారణ ప్రదర్శన కనబరుస్తోంది. టెస్ట్‌ల్లో తాత్కలిక సారథిగా జస్‌ప్రీత్ బుమ్రా కొనసాగుతున్నాడు. రోహిత్ శర్మ తప్పుకుంటే అతనే పూర్తి స్థాయి కెప్టెన్‌గా మారనున్నాడు. భారత క్రికెట్‌లో గతంలో ఎప్పుడూ ఇలా ఫార్మాట్‌కో కెప్టెన్ లేదు. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌కు ఒకరు.. టెస్ట్‌ల్లో మరొకరు కొనసాగిన సందర్భాలు మాత్రమే ఉన్నాయి.


# వాషింగ్టన్ సుందర్ నాటౌట్.. అంపైర్‌ది తప్పుడు నిర్ణయం: జస్‌ప్రీత్ బుమ్రా

ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఐదో టెస్ట్‌లో అంపైర్ల నిర్ణయాలపై టీమిండియా కెప్టెన్ జస్‌ప్రీత్ బుమ్రా అసంతృప్తి వ్యక్తం చేశాడు. ముఖ్యంగా థర్డ్ అంపైర్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నాడని అసహనం వ్యక్తం చేశాడు.

గత మ్యాచ్‌లో స్నికోను పరిగణలోకి తీసుకోని థర్డ్ అంపైర్.. తాజా మ్యాచ్‌లో తీసుకోవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశాడు. టీమిండియా స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ వికెట్ విషయంలో బుమ్రా ఇలా స్పందించాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

అసలేం జరిగిందంటే..?

ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా శుక్రవారం సిడ్నీ వేదికగా ప్రారంభమైన ఆఖరి టెస్ట్‌లో టాస్ గెలిచిన టీమిండియా ముందుగా బ్యాటింగ్ చేసింది. ప్యాట్ కమిన్స్ వేసిన 66వ ఓవర్‌లో వాషింగ్టన్ సుందర్ వివాదాస్పద రీతిలో క్యాచ్ ఔటయ్యాడు. కమిన్స్ వేసి షార్ట్ పిచ్ బాల్‌ను థర్డ్ మ్యాన్ దిశగా సుందర్ ఆడే ప్రయత్నం చేయగా.. బ్యాట్‌ను మిస్సైన బంతి కీపర్ అలెక్స్ క్యారీ చేతిలో పడింది. వెంటనే ఆసీస్ ఆటగాళ్లు గట్టిగా అప్పీల్ చేశారు. అయితే ఫీల్డ్ అంపైర్లు నాటౌటివ్వగా.. ఆసీస్ రివ్యూ తీసుకుంది.



థర్డ్ అంపైర్ జోయల్ విల్సన్.. పలు కోణాల్లో టీవీ రిప్లేలను పరిశీలించాడు.

బంతి.. వాషింగ్టన్ సుందర్ గ్లోవ్‌ను తాకిందా? లేదా? అని స్నీకో మీటర్ సాయంతో పరీక్షించాడు. ఒక కోణంలో తాకనట్లుగా.. మరో కోణంలో తాకినట్లుగా స్పైక్ వచ్చింది. సరైన ఆధారం లేకున్నా.. వాషింగ్టన్ సుందర్ ఔట్ అంటూ ప్రకటించాడు. ఈ నిర్ణయం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. నాన్ స్ట్రైకర్‌గా ఉన్న బుమ్రా.. వెంటనే ఫీల్డ్ అంపైర్లతో తన అసంతృప్తిని వ్యక్తం చేశాడు.

# నిప్పులు చెరిగిన బోలాండ్, స్టార్క్.. కుప్పకూలిన భారత్!

ఆస్ట్రేలియాతో ఐదో టెస్ట్‌లోనూ టీమిండియా బ్యాటర్లు తడబడ్డారు. బౌలింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై ఆస్ట్రేలియా బౌలర్లు నిప్పులు చెరగడంతో పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీ వేదికగా శుక్రవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 185 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్(98 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 40), రవీంద్ర జడేజా(95 బంతుల్లో 3 ఫోర్లతో 26) టాప్ స్కోరర్లుగా నిలిచారు. చివర్లో బుమ్రా(17 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 22) విలువైన పరుగులు చేశాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో స్కాట్బోలాండ్(4/31) నాలుగు వికెట్లతో చెలరేగగా.. మిచెల్ స్టార్క్(3/49) మూడు వికెట్లు పడగొట్టాడు. ప్యాట్ కమిన్స్(2/37) రెండు వికెట్లు దక్కాయి. నాథన్ లయన్ ఓ వికెట్ తీసాడు.

తేలిపోయిన భారత బ్యాటర్లు..

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో కేఎల్ రాహుల్(4) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఆ కాసేపటికే యశస్వి జైస్వాల్(10)ను బోలాండ్ స్టన్నింగ్ డెలివరీతో పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి విరాట్ కోహ్లీ రాగా.. ఎదుర్కొన్న ఫస్ట్ బాల్‌కే అతనికి లైఫ్ లభించింది. ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ బాల్‌ను కోహ్లీ వెంటాడగా.. స్లిప్‌లో ఉన్న స్మిత్ వైపు దూసుకెళ్లింది. అయితే అతను బంతిని అందుకునే క్రమంలో నేలకు తాకడంతో అంపైర్ నాటౌటిచ్చాడు. ఈ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఔటయ్యే ప్రమాదం నుంచి కోహ్లీ బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. శుభ్‌మన్ గిల్‌తో కలిసి ఆచితూచి ఆడాడు.

ఓపికగా ఆడిన ఈ జోడీని నాథన్ లయన్ విడదీసాడు. తొలి సెషన్ ఆఖరి బంతికి శుభ్‌మన్ గిల్ అనవసర షాట్‌తో పెవిలియన్ చేరాడు. దాంతో భారత్ 57/3 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది.

పోరాడిన రిషభ్ పంత్..

క్రీజులోకి రిషభ్ పంత్ రాగా.. రెండో సెషన్ ప్రారంభమైన కాసేపటికే కోహ్లీ(17) మరోసారి తన బలహీనతను బయటపెట్టుకున్నాడు. మళ్లీ ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ డెలివరీని వెంటాడి పెవిలియన్ చేరాడు. ఈ పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన జడేజాతో కలిసి పంత్ పోరాడాడు. శరీరాన్ని అడ్డుపెట్టి క్రీజులో నిలబడ్డాడు. పిచ్‌పై అనూహ్య బౌన్స్ ఉండటంతో బంతి అనేకసార్లు రిషభ్ పంత్ శరీరానికి తాకింది. 107/4 స్కోర్‌తో టీమిండియా టీ బ్రేక్‌కు వెళ్లింది.

# జస్‌ప్రీత్ బుమ్రా, రాహుల్ ద్రవిడ్‌లను అవమానించిన కేంద్ర ప్రభుత్వం!

గతేడాది అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన క్రీడాకారులకు క్రేంద్ర ప్రభుత్వం అవార్డులను ప్రకటించింది. పారిస్ ఒలింపిక్స్‌తో పాటు విశ్వ వేదికలపై సత్తా చాటిన ప్రతిభావంతులకు పురస్కారాలను ప్రకటించింది.

దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డుకు నలుగురు ఆటగాళ్లను ఎంపికచేశారు. అయితే క్రికెట్ నుంచి ఒక్క ఆటగాడికి కూడా ఈ అవార్డ్ లభించలేదు.

పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలతో సత్తా చాటిన షూటర్ మను భాకర్, వరల్డ్ చెస్ ఛాంపియన్ గుకేశ్, భారత పురుషుల హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్‌కుమార్‌లు అత్యున్నత క్రీడా పురస్కారానికి ఎంపికయ్యారు. టీమిండియా టీ20 ప్రపంచకప్ 2024 గెలవడంలో కీలక పాత్ర పోషించిన జస్‌ప్రీత్ బుమ్రాను ఈ అవార్డ్‌కు ఎంపిక చేయాల్సిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేకాకుండా 11 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత టీమిండియా ఐసీసీ టైటిల్ అందుకోవడంలో కీలక పాత్ర పోషించిన హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు ద్రోణాచార్య అవార్డ్ ఇవ్వాల్సిందని క్రికెట్ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. 32 మందికి అర్జున అవార్డ్‌కు ఎంపికవ్వగా.. ఇందులో ఒక్క క్రికెటర్ కూడా లేడు. 17 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత టీమిండియా టీ20 ప్రపంచకప్ గెలిస్తే.. కేంద్ర ప్రభుత్వం క్రికెటర్లను పట్టించుకోలేదు. గతేడాది బుమ్రా టెస్ట్ క్రికెట్‌లో 71 వికెట్లు పడగొట్టాడు. టీ20 ప్రపంచకప్ 2024లో 15 వికెట్లు పడగొట్టాడు. మెరుగైన ప్రదర్శన చేసిన బుమ్రాను ఖేల్ రత్న అవార్డ్‌కు ఎంపిక చేయాల్సిందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**